

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఏలూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులకు 389 అర్జీలు అందాయి. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పనులపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం నిర్దేశించిన పీఎం జన్‌మన్ పథకం ద్వారా జిల్లాలో మంజూరు చేసిన పనులను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గిరిజనుల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలపై కలెక్టర్ సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ప్రజలకు మెరుగైన సేవలు

ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులను ఏఐ బోట్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసి మెరుగైన పోలీసు సేవలు అందిస్తామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలో పోలీసు అధికారు లకు ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ కిశోర్, ఏఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిదారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై క్షుణ్ణంగా దర్యాప్తు చేసి చట్ట ప్రకారం న్యాయం చేస్తామన్నారు.

కమిటీలేవి సామీ!

సొసైటీల్లో త్రిసభ్య కమిటీల నియామకంలో అడుగు పడింది. మరోవైపు జిల్లాలో మార్కెట్ కమిటీ పాలకవర్గాలు పూర్తిగా భర్తీకాలేదు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆలయ కమిటీలకు మోక్షం ఏదీ అనేది అందరి ప్రశ్న. జిల్లావ్యాప్తంగా పేరొందిన ఆలయాలకు చైర్మన్, సభ్యుల పేర్లను సిఫార్సు చేసినా ఎమ్మెల్యేలు మరికొన్ని ఆలయాల జాబితాలను ఇప్పటికీ రూపొందించలేకపోయారు. ఏడాది గడిచినా స్పష్టత లేదు. స్థానికంగా సర్దుబాటు చేయలేక జాప్యం తప్పడం లేదు.



- జిల్లాలో నోటిఫై చేసింది 73 ఆలయాలు
- కమిటీలకు సిఫార్సు చేసింది 43
- ఆశావహులు ఎక్కువ మంది..!
- కొన్నిచోట్ల కూటమిలో కుదరని సయోధ్య
- మరికొన్ని చోట్ల ఎంపికలో తీవ్ర జాప్యం
- కేడర్‌లో ఆగ్రహం, అసంతృప్తి



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. రెండు, మూడు నెలలుగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. వరుసగా నియోజకవర్గాల వారీగా నామినేటెడ్ పదవుల ఆశించిన వారి సంఖ్య డజన్లలోనే ఉంది. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టించి పనిచేసిన వారు, వైసీపీ ఆగడాలను తట్టుకొని ధైర్యంగా నిలబడిన వారు, ఆది నుంచి పార్టీనే నమ్ముకున్న సీనియర్లను ఎమ్మెల్యేలు గుర్తించి ఆలయ కమిటీలకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా నామినేటెడ్ పదవుల భర్తీలో వేగంగా వ్యవహరించింది. తెలుగుదేశం ప్రభుత్వంలో జాప్యం కొనసాగడంపై అసంతృప్తి నెలకొంది. జిల్లాలో పేరొందిన మద్ది ఆంజనేయస్వామి, పట్టిసీమ వీరేశ్వర దేవస్థానం, కొల్లేటి కోట పెద్దింటమ్మ, రాట్నాలమ్మ, అప్పనవీడు అభయాంజనేయస్వామి, ఏలూరు ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి వంటి ఆలయాలకు నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఇప్పటికే సిఫార్సులు చేశారు. పార్టీకి పూర్తిగా అంకితం కావడమే కాకుండా హిందూ సంప్రదాయాలకు కట్టుబడి ఉన్న వారిని ఆలయ కమిటీలకు ఎంపిక చేస్తారు. పార్టీల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన వారికి ఆయా కమిటీల్లో స్థానం కోసం పోటీ నెలకొంది.

ఏ పార్టీకి కేటాయించాలి..?

జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి కమిటీ చైర్మన్ పదవి టీడీపీకి కేటాయించాలా.. జనసేనకు ఇవ్వాలా అనే విషయమై తర్జనభర్జనలు సాగుతున్నాయి. మార్కెట్ కమిటీ ఏ పార్టీకి కేటాయిస్తే మరో పార్టీకి మద్ది ఆలయం కమిటి వదిలి వేయాలని స్థానిక నేతలు పట్టుబడుతున్నారు. జనసేన పక్షాన సీతారాం ఈ పదవిని ఆశిస్తుండగా, తెలుగుదేశం నేతలు రాజాన పండు, చిక్కాల ఆంజనేయులు కూడా గట్టి పట్టుబడుతున్నారు. గోకుల పారిజాత గిరి కమిటీ చైర్మన్ కోసం బీజేపీ తొంగి చూస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి పూర్తిగా సంతృప్తి పడితేగానీ ఆలయ కమిటీలు ఒక గాడిన పడే అవకాశాల్లేవు. మొదటి నుంచీ మద్ది చైర్మన్ కోసం వైసీపీ హయాంలో కూడా తీవ్ర పోటీ తలెత్తింది. అప్పట్లో కూడా ఆచితూచి వైసీపీ నేతల మధ్య విభేదాలు తలెత్తకుండా జాగ్రత్త పడ్డారు. పట్టిసీమ దేవస్థానం చైర్మన్‌గా వెంకట జగన్నాథరావు మరోమారు చైర్మన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. గడిచిన నాలుగేళ్లగా జగన్నాథరావు పట్టిసీమ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాట్నాలమ్మ ఆలయ కమిటికి రాయనపాలెంకు చెందిన మన్నె శ్రీనివాస్

మిగతా 8వ పేజీలో..

రూ.12 వేల జీతానికి పనిచేశా..

మెగా జాబ్‌మేళాలో ఎంపీ మహేశ్

పెదపాడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తాను సివిల్ ఇంజనీరింగ్ చదివి చిన్న కంపెనీలో రూ.12వేలు జీతంతో పనిచేశానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యువతకు వివరించారు. ఆ అనుభవంతో ఐదు కంపెనీలు గ్రూప్‌గా ఏర్పడి రూ.4వేల కోట్ల టర్నోవర్‌తో వ్యాపారాన్ని విస్తరించినట్లు తెలిపారు. వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారని, కూటమి ప్రభుత్వంలో తిరిగి వస్తున్నారని ఎంపీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు విద్య, ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి పెట్టినట్లు ఎంపీ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పన లక్ష్యంగా జిల్లాలో 42 జాబ్ మేళాలు నిర్వహించి 2500 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మొదటగా వచ్చిన ఉద్యోగం జీవితానికి తొలిమెట్టు భావించి మంచి అనుభవం పొంది భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ ఉద్యోగావకాశాలకు పోటీ తీవ్రంగా ఉందని, ఉద్యోగ మేళా ద్వారా అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల పర్యటన

ఏలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. కలెక్టరేట్‌లో జిల్లా విజన్ యాక్షన్‌ప్లాన్, అనంతరం పీ-4 కార్యక్రమంపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు నుంచి చొదిమెళ్ల చేరుకుని ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తారు. అనంతరం పశుసంవర్ధకశాఖ ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని మంత్రి నాదెండ్ల పరిశీలిస్తారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో మిగిలివున్న సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీచేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 20 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ డి.భూషణం తెలిపారు. గడువులోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ కాపీ ప్రింటవుట్, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎంచుకున్న ఐటీఐలో ఈ నెల 22లోపు పరిశీలనకు తీసుకువెళ్లాలన్నారు. పరిశీలన పూర్తయిన వారిని మాత్రమే కౌన్సెలింగ్‌కు పిలవడం జరుగుతుందన్నారు. అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 23 నుంచి 25 వరకు, ప్రైవేటు ఐటీఐలలో 26, 27 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని ఆయన సూచించారు.


బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

కఠిన చర్యలు తీసుకోవాలని బంధువుల ఆందోళన

7

లిఫ్ట్ ఇస్తామని దోపిడీ..

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



కుక్కునూరులోని గుండేటివాగు వరకు తగ్గిన గోదావరి వరద

గోదావరి వరద తగ్గింది

కుక్కునూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గడంతో ఏజెన్సీ ప్రాంతవాసులు ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం సోమవారం సాయంత్రం 23.2 అడుగులకు చేరింది. కుక్కునూరులో గుండేటి వాగు వరకు గోదావరి తగ్గిపోయింది. గొమ్ముగూడెం నుంచి దాదాపు 250 కుటుంబాలు దాచారం పునరావాస కాలనీకి తరలివచ్చారు. జంగారెడ్డిగూడెం మండలం చల్లావారి గూడెంలో పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో వారంతా గొమ్ముగూడెంలోను ఉంటున్నారు. వరదతో దాచారం పునరావాస కాలనీకి తరలివచ్చారు. వర్షాకాలం మూడు నెలలు వారు పునరావాసంలో ఉండాలని అధికారులు సూచించారు.

24 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

58 సహకార సంఘాలకు కమిటీల ఎంపిక పూర్తి

ఏలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 24 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ సహకారశాఖ ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉంగుటూరు, ఏలూరు, నూజివీడు, పోలవరం నియోజకవర్గాల్లోని కమిటీలకు చోటు దక్కింది. జిల్లాలో 158 సొసైటీలకు తొలివిడత 39 కమిటీలను ప్రతిపాదనలను పంపగా 34 కమిటీలను నియమించారు. రెండో విడతలో 29 కమిటీలకు ప్రతిపాదించగా, 24 కమిటీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రెండు విడతలుగా 54 సొసైటీల్లో త్రిసభ్య కమిటీల ఎంపిక పూర్తయింది.

గ్రామం	చైర్మన్	సభ్యులు
భీమడోలు	గన్ని వీరాంజనేయులు	జి.శ్రీనివాసరావు, వి.రాంబాబు
పూళ్ల	వట్టి లక్ష్మీనారాయణ	కె.ఎన్.సత్యనారాయణ,వీవీ సత్యనారాయణ
ఏలూరు టౌన్	ఈర్ని అశోక్‌కుమార్	బుద్దా నాగేశ్వరరావు, ఎం.ఏసుబాబు
శనివారపుపేట	కొనేరు వంశీకృష్ణ	ఎస్.రామ్మోహన్‌రావు, కె.మహేష్
అడవికొలను	గోలి పుండరి కాసుడు	ఎస్.శ్రీనివాసరావు,రెడ్డి మాధవరావు
పెదనిండ్రకొలను	కెసత్యనారాయణ	బి.శ్రీనివాస్, ఏఎస్ఆర్ గోపాలకృష్ణంరాజు
చిగురుకోట	సీహెచ్ జగన్‌మోహన్‌రావు	బి.శ్యామలరాజు, కుంచె కోటేశ్వరరావు
పుట్లచెరువు	జి.సత్యనారాయణ	బి.అప్పారావు, జి.నాగేశ్వరావు
యనమదల	పి.సత్యవరప్రసాద్	డి.వెంకటరత్నం, పి.రంగారావు
తుక్కులూరు	గోగినేని రామకృష్ణ	పి.సాంబశివరావు, బి.ఆరోగ్యం
ఎంఎన్ పాలెం	వై సృజనాచౌదరి	ఎం.శోభానాద్రి, ఓలేటి వెంకట రంగారావు
మీర్జాపురం	కన్నెకంటి శ్రీనివాసరావు	జె.రంగారావు, డి.డేవిడ్ రాజు
పోతురెడ్డిపల్లి	అక్కినేని బెనర్జీ	జె.రాణి, ఎం.తిరుపతయ్య
పల్లెర్లమూడి	అట్లూరి రమేష్	బి.ఉషారాణి, ఎస్.సంగీతరావు
తోటపల్లి	పరిమి శోభానాద్రి	బి.శివెంకట రాంబాబు, ఎం.రామకృష్ణ
కృష్ణావరం	కొండిశెట్టి శ్రీనివాసరావు	వి.విసర్నాధం, పోట్రు రామారావు
శోభానాపురం	నలజల్ల హరిబాబు	సీహెచ్.గోపికృష్ణ, టి.తిరుపతిరావు
వలసపల్లి	కొల్లి కృష్ణయ్య	కర్రా మహాలక్ష్మి, కె.సత్యనారాయణ
గోపవరం	యు.గణేష్,	వీబీచక్రధరరావు, పి.స్వరూపరాణి
కాట్రేనిపాడు	బొమ్మకంటి శ్యామలరావు	జె.కనకయ్య, పిన్నిబోయిన స్వాతి
చనుబండ	మోరంపూడి శ్రీనివాసరావు	కంచు మల్లయ్య, ఎన్.ప్రభాకర్‌రావు
పోలవరం	ఎర్రా ప్రసాదరావు	తాణంకి దేవరాజు, యర్రోజు పద్మావతి
తుమ్మగూడెం	దమ్మెర సత్యరామ్‌కుమార్	మద్దాల చిట్టిబాబు, త్రివేది ఆదెమ్మ
నర్సింహారావుపాలెం	కట్టా నాగదుర్గారావు	టి.సురేష్‌రెడ్డి, నక్కా యూస్రీరాణి

చినుకు జాడేది..?

- మెట్ట ప్రాంతంలో ఎండుతున్న నారుమడులు
- దుక్కిదున్నినా నీరందక నాట్లు వేయలేదు
- బోర్ల కింద విత్తనాలు వెదజల్లిన రైతులు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు

చింతలపూడి/లింగపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెట్ట ప్రాంతమైన చింతలపూడి సబ్ డివిజన్‌లో వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఇప్పటి వరకు వెదజల్లే విధానంలో సుమారు 3,500 ఎకరాలు, నాట్లు, బోర్ల కింద 2,500 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పూర్తిస్థాయిలో నీరందక నారుమడులు ఎండుతున్నాయి. చెరువుల్లో నీరు లేకపోవడం, గొట్టపు బావుల కింద నాట్లు వేసినా 15 రోజులుగా ఎండ తీవ్రతకు తడులు చాలక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మెట్ట ప్రాంతంలో వర్షాధార చెరువుల కింద వరి సాగు జరుగుతుంది. గత మే, జూన్‌లో సాధారణ వర్షం పాతం కంటే కొద్ది శాతం ఎక్కువ పడడంతో రైతులు సాగు చేపట్టారు. రెండు నెలల క్రితమే భూములు దుక్కి దున్ని సిద్ధం చేసుకున్నారు. జూలైలో సాధారణ వర్షపాతం 270 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా ఇప్పటి వరకు 50 మిల్లీమీటర్లు కూడా పడలేదు. మధ్యాహ్నం ఎండ, సాయంత్రం ఉక్కబోతతో చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. కాంతంపాలెం, రాఘవాపురం, గణిజర్ల, మల్లాయిగూడెం, యండపల్లి ప్రాంతాల్లో వెదజల్లే విధానంతో నాట్లు వేశారు. వారం రోజుల్లో వర్షం పడకపోతే ఈ ప్రాంతంలో వరి ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీరోజూ పొలాల వైపు చూస్తూ ఈ రోజైనా వర్షం పడుతుందా అంటూ రైతులు ఎదురు చూస్తున్నారు.



చింతలపూడి మండలంలో నీరందక నాట్లు వేయని భూమి

మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం లక్ష్యం. ఫేజ్-1, 2 పనులకు రూ.మూడు వేల కోట్లు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికే 20 ఏళ్లు గడిచిందని, ఇంతవరకు కాలువల తవ్వకాలే లేవని, భూములు కోల్పోయామని, గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న చెరువులు

లింగపాలెం మండలంలో చెరువులు ఎండిపోతున్నాయి. బోర్ల ఆధారిత పంటలు తప్ప ఇతర భూముల్లో సాగుపై రైతులలో ఆందోళన నెలకొంది. మేలో కురిసిన వర్షాలకు పత్తి, వరి సాగు చేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోరు బావులు తప్ప మిగిలిన చోట్ల సాగు చేపట్టలేదు. అక్కడక్కడా నారుమడి వేసినా నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతన్నకు ఆర్థిక భరోసా

అన్నదాత సుఖీభవ అర్హులు 1,64,285 మంది

ఏలూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పెట్టుబడి సాయం అందించడానికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి అర్హులైన రైతుల జాబితా సిద్ధం చేశారు. తొలుత ఈనెల 4న సచివాలయాల్లో అన్నదాతా సుఖీభవ జాబితా ఉంచారు. అర్హత ఉన్నా జాబితాలో లేనివారు ఈ నెల 13లోపు తమ అర్హత పత్రాలను సమర్పించాలని సూచించారు. తర్వాత ఈనెల 14 వరకు గడువు పొడిగించి ఎన్నో వడపోతల అనంతరం అర్హుల జాబితా రూపకల్పనకు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు చేసింది. అర్హులైన రైతులందరికీ ఈకేవైసీ తప్పనిసరి కావడంతో ఈకేవైసీ చేయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఐటీ చెల్లింపులు చేస్తున్న వారు, భూస్వాముల పేర్లపై పూర్తిగా వడపోత ద్వారా తుది జాబితా ఖరారు చేశారు.

అర్హుల జాబితా సిద్ధం

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 1,64,285 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. ఇవిగాక గ్రీవెన్స్‌లో 1345 దరఖాస్తులు రాగా వాటిలో 1203 దరఖాస్తుదారులను అర్హులుగా తేల్చారు. వీరందరికీ కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్‌తో పాటు అన్నదాత సుఖీభవ సొమ్ము కలిపి రూ.20 వేలు అందజేయనున్నారు. మూడు విడతలుగా అందిస్తారని తెలుస్తోంది. త్వరలో రైతుల బ్యాంకు ఖాతాలలో జమకానుంది.

అభ్యంతరాల పరిశీలన పూర్తి

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి తొలి జాబితాలో తమ పేర్లు నమోదు కానివారు స్థానిక రైతు సేవా కేంద్రాలలో అర్హతలను చూపిస్తూ గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రీవెన్స్‌కు 1345 దరఖాస్తులు రాగా అర్హత ఉన్న 1203 దరఖాస్తులను అప్రూవల్ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. గ్రీవెన్స్‌లో అత్యధికంగా జిల్లాలోని నూజివీడు నుంచి 332 దరఖాస్తులు రాగా వాటన్నింటిని అప్రూవల్ చేశారు. అత్యల్పంగా బుట్టాయిగూడెం మండలం నుంచి 3 దరఖాస్తులు వచ్చాయి .

మండలం	అర్హులు
ఆగిరిపలి	10,244
టి నరసాపురం	9,284
పెదపాడు	4,797
ముసునూరు	8,313
నిడమర్రు	2,234
లింగపాలెం	8,387
కామవరపుకోట	8,242
భీమడోలు	3,603
జీలుగుమిల్లి	3,343
మండవల్లి	2,015
చింతలపూడి	12,924
నూజివీడు	9,135
పెదవేగి	9,643
జంగారెడ్డిగూడెం	8,370
వేలేరుపాడు	570
ముదినేపల్లి	4,958
చాట్రాయి	8,330
దెందులూరు	5,929
కైకలూరు	1,222
కొయ్యలగూడెం	8,470
పోలవరం	5,108
కుక్కునూరు	1,666
బుట్టాయిగూడెం	6,245
ఉంగుటూరు	8,265
కలిదిండి	759
ఏలూరురూరల్	1,170
ద్వారకాతిరుమల	10,016
ఏలూరు అర్బన్	1,043

గ్రామ/వార్డు సచివాలయ ఏఎన్ఎంల బదిలీల్లో తప్పిదాలు?

తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు రిలీవ్ కావద్దు

అధికారుల మౌఖిక ఆదేశాలు

7

బంగారం దూకుడు..



రూ.లక్ష దాటిన పసిడి
గ్రాము బిస్కెట్ రూ.10,120
కేజీ వెండి రూ.లక్షా 17 వేలు



నరసాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర మరోసారి లక్ష దాటింది. అక్కడే స్థిరంగా నిలబడింది. సోమవారం బులియన్ మార్కెట్‌లో గ్రాము బిస్కెట్ బంగారం రూ.10,120 పలికింది. ఈ లెక్కన పది గ్రాముల బంగారం రూ.1,01,200 చేరింది. ఆర్నమెంట్ బంగారం గ్రాము రూ.9,310 ఉంది. వెండి కూడా ఆల్‌టైం రికార్డుకు చేరింది. కేజీ వెండి రూ.లక్ష 17 వేలు పలికింది. ఇదే బులియన్ మార్కెట్‌లో అత్యధిక ధర. ప్రస్తుతం ఆషాఢ మాసం కొనసాగుతుంది.మరో 15 రోజుల్లో శ్రావణం రానుంది. పెళ్లిళ్లు, ముహూర్తాలు ఉన్నాయి. అయితే ధర ప్రభావంతో జిల్లాలోని బులియన్ మార్కెట్ వెలవెలబోయింది. ఈ ధరకు కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు. ఏదో మొక్కుబడిగా కొన్ని వస్తువుల్ని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వెండికి సంబంధించి ఇదే సీన్ కనిపిస్తున్నది. సాధారణంగా పెళ్లిళ్ల అంటే వెండి కంచాలు, చెంబులు కొంటారు. ఇక శ్రావణ మాసంలో సెంటిమెంట్‌గా పూజకు అవసరమైన వెండి సామాగ్రిని కొనుగోలు చేస్తుంటారు. అయితే వెండి ధర చూసి మహిళలు వెనకంజు వేస్తున్నారు.

కారణాలు.. ఎన్నో..

వెండి, బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందన్న వాదనలు బులియన్ మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఏడాది జనవరి నుంచి బంగారం ధర పెరగడమే తప్ప దిగి రాలేదు. జనవరిలో గ్రాము బంగారం రూ.6,500 ఉంది. నేడు గ్రాముకు రూ.4 వేలు పెరిగింది. ప్రస్తుతం ట్రంప్ సుంకాల భయం ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఇటు రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్, పాలస్తీనా, ఇరాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం, డాలర్, స్టాక్ మార్కెట్ల పతనం, క్రూడ్ ఆయిల్ పెరుగుదల తదితర ప్రభావాలు బులియన్ మార్కెట్‌పై పడ్డాయి. దీంతో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు సేఫ్ అన్న ధీమాతో ఉన్నారు. ఈ కారణంగానే పసిడి, వెండి ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్న వాదనలు విని పిస్తున్నాయి.ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో రూ.లక్షా 10 వేలు దాటే అవకాశం ఉందని బులియన్ వర్గాలు చెపుతున్నాయి. పెరిగిన ధరలు జిల్లా బులియన్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. శ్రావణమాసం వస్తున్నా మార్కెట్‌లో మాత్రం కళ కనిపిం చడం లేదు. నరసాపురం, భీమవరం వంటి ప్రధాన మార్కెట్లలో జ్యూయలరీ షాపులు వెలవెలబోతున్నాయి.

ముంచెత్తుతున్న ఉల్లి !



పెరిగిన సాగు విస్తీర్ణం
దిగుబడులు ఆశాజనకం
ఎగుమతులు లేక దేశీయంగానే వినియోగం
ధర పతనమయ్యే అవకాశాలు

తాడేపల్లిగూడెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉల్లి సాగు గణనీయంగా పెరిగింది. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు సాగు మరింత పెంచారు. గత సంవత్సరం నాసిరకం ఉల్లి కూడా క్వింటా రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు ఉల్లి సాగువైపు మళ్లారు. సాగు విస్తీర్ణం విపరీతంగా పెరిగింది. దిగుబడి కూడా ఆశాజనకంగా రావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు తాడేపల్లి గూడెం ఉల్లి మార్కెట్లో మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లి క్వింటా రూ.1500 నుంచి రూ.2000 మధ్య విక్రయాలు జరుగుతున్నాయి. తక్కువ నాణ్యత కలిగిన ఉల్లి ఆటోల్లో గ్రామీణ ప్రాంతాలకు వేసికెళ్లి రూ.100కు 5 కేజీలు, ఐదున్నర కేజీలు అమ్మేస్తున్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి ఉల్లి క్వింటా హోల్‌సేల్‌గా రూ.3 వేలు ఉండేది. ఇప్పుడు ఇబ్బడి ముబ్బడిగా కర్నూలు నుంచి వచ్చే అవకాశం ఉంది. ఉల్లి ధరలు అదుపులో ఉండటానికి ఉల్లి ఎగుమ తులపై కేంద్రం నిషేధం ఉంచడం మరో కారణంగా వ్యాపారులు పేర్కొంటున్నారు

మహారాష్ట్రలో పేరుకుపోయిన నిల్వలు

మహారాష్ట్రలో పండించిన ఉల్లి నిల్వలు పేరుకుని ఉన్నాయి. గతంలో ఆగస్టు నాటికి ఉల్లి సీజన్ మహారాష్ట్రలో పూర్తి అయ్యేది. కాని ఈ సంవత్సరం అక్కడ ఉల్లి నిల్వలు అధికంగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. గత సంవత్సరం మహారాష్ట్రలో కురిసిన అధిక వర్షాలకు పంట దెబ్బతింది. దీంతో ఉల్లికి మంచి గిరాకీ వచ్చింది. ధర అధికంగా ఉండటంతో అక్కడ ఉల్లి సాగు పెంచారు. మహారాష్ట్రలో నాందేడ్, అకోలా, శ్రీరామ్‌పూర్, నాసిక్, నగర్‌ల్లో సాగు చేస్తున్నారు. గతం కంటే ఈ సంవత్సరం దిగు బడులు ఆశాజనకంగా వచ్చాయి. ఇక్కడ ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసంలో ఉల్లి సాగు ప్రారంభిస్తారు. మూడు నెలలకు పంట చేతి కందుతుంది. జనవరిలో ఉల్లిని సేకరించి ఒక నెలపాటు నిల్వ ఉంచుతారు. ఫిబ్రవరి నెల నుంచి వీటి విక్రయాలు కొనసాగిస్తుంటారు. దేశవ్యాప్తంగా మహారాష్ట్ర నుంచే 75 శాతం ఉల్లి ఎగుమతులు జరుగుతుంటాయి.

ఆగస్టు వరకు మహారాష్ట్ర ఉల్లే..

సెప్టెంబర్ మొదటి వారం వరకు కర్నూలు ఉల్లి మార్కెట్‌కు వచ్చే అవకాశాలు కనబడటం లేదు. దీంతో మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లే పెద్ద దిక్కుగా మారింది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రోజూ 10 నుంచి 15 లారీలలో మహారాష్ట్ర ఉల్లి దిగుమతి అవుతోంది. ఇవి ఒక్కొక్క లారీ 20 టన్నుల నుంచి 30 టన్నుల లోడ్‌తో తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

కర్నూలులో పెరిగిన సాగు

కర్నూల్లో రైతులు ఉల్లి సాగు విపరీతంగా చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. గత సంవత్సరం మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు అక్కడ పంట దెబ్బతింది. దీంతో కర్నూలు ఉల్లికి మంచి డిమాండ్ వచ్చింది. క్వింటా రూ.4 వేలు నుంచి 6 వేల వరకు విక్రయించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ సీజన్‌లో కర్నూల్లో సాగు విస్తీర్ణం అమాంతంగా పెంచారు. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు పెరిగి, పెద్ద సైజుల్లో నాణ్యమైన ఉల్లి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు ఉల్లి మార్కెట్‌కు వస్తే ఉల్లి ధరలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్‌లో తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రోజుకు 100 లారీలు వచ్చేవి. ఈ సంవత్సరం దిగు బడులు ఆశాజనంగా ఉండటంతో పాటు విస్తీర్ణం పెరగడంతో ఆ సంఖ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే వ్యాపారుల సంఖ్య పెరగడంతో కొంత మంది వ్యాపారులు నేరుగా కర్నూలు నుంచే కొనుగోలు చేసి తీసుకు పోతున్నారు. కర్నూలు ఉల్లి ఎక్కువగా ఒడిశా, బెంగాల్, బంగ్లాదేశ్ ప్రాంతాల వారు ఇష్టపడతారు. ఇక్కడ పండించిన ఉల్లి మంచి ఘాటుగా ఉండటంతో దీనివైపు వారు మొగ్గు చూపుతారు.

మార్కెట్లోకి కర్నాటక ఉల్లి

మార్కెట్లోకి కర్నాటకలోని గుల్బర్గా జిల్లాలోని సాగు చేసిన ఉల్లి కూడా వచ్చింది. ఇక్కడ పండించిన ఉల్లికి మంచి డిమాండ్ ఉంటుంది. రంగు, సైజుతో పాటు రుచి కూడా బాగుండడంతో దీన్ని ఎక్కువ ఎగుమతులకు వినియోగిస్తుంటారు. ఇప్పుడు గుల్బర్గాలో కూడా ఉల్లి సాగు విస్తీర్ణం రైతులు పెంచారు. ఇలా దేశవ్యాప్తంగా రైతులు ఉల్లి సాగు పెంచడంతో ధరలు పతనమయ్యే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయంటూ వ్యాపారులు సైతం ఆందోళన చెందుతున్నారు.

బీ కేర్ ఫుల్ బ్రదర్ !

ఫొటోగ్రాఫర్ : భీమవరం (ఆంధ్రజ్యోతి)



జారిపడతారు జాగ్రత్త..







భీమవరం పట్టణంలో కనిపించిన దృశ్యాలివి..



అవసరం ఎంతపనైనా చేయిస్తుంది.. కష్ట నష్టాలతో దానికి పనుండదు.. పనైపోవాలనే ఆత్రుతలో పరుగులు తీస్తుంటారు.. ఆనక ఏదైనా జరిగితే అయ్యో అని బాధపడతారు.. ఇలాంటి దృశ్యాలే ఇవి.. మనం ఏదైనా భారీ వస్తువు కొనుక్కుంటే వాటిని ఆటోలో గానీ, ఇతర లోడ్ వాహనాల్లో తరలించుకోవాలి.. కానీ కొంతమంది ఎందుకులే కిరాయి కలిసి వస్తుందని ఇలా విన్యాసాలు చేస్తుంటారు.. దీని వల్ల వారికే కాదు.. పక్కన ప్రయాణిస్తున్న వారికి కూడా ఇబ్బందే..





గుట్టల్లో.. నోట్ల కట్టలు



యథేచ్ఛగా ఇసుక దోపిడీ
లక్షల్లో దండుకుంటున్న కొందరు ప్రజాప్రతినిధులు
నిల్వ చేసిన ఇసుకకు రెక్కలు
భారీ ధరలకు విక్రయాలు
అడ్డుకట్ట వేసేవారే లేరు

పాలకొల్లు (ఆంధ్రజ్యోతి): ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. గోదావరి తల్లికి గర్భశోకాన్ని కల్గిస్తూ నిలువునా ఇసుకను తవ్వేసి గోదావరి ఒడ్డునే గుట్టలు పెట్టి ఎడాపెడా అమ్మి కోట్ల దోచేస్తున్నారు. ముందుగానే నిల్వలు చేసిన ఇసుకను ఇప్పుడు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా మల్లేశ్వరంలో 5 యూనిట్లు ఇసుక రూ.5800 వసూలు చేస్తుండగా గోపాలపురం, సిద్ధాంతం, పెండ్యాల, తీపర్రు, పురుషోత్తపల్లి, తదితర ప్రాంతాలలో నిల్వ చేసిన ఇసుక అమ్మకాలకు ధరలు నిర్ణయించారు. రూ.8 నుంచి 9 వేల వసూళ్లకు శ్రీకారం చుట్టారు. లక్షల టన్నులు ఇసుకను నిల్వలు చేసి అమ్మి సొమ్ము చేసు కుంటున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు ప్రజా ప్రతినిధులకు నేరుగా రోజువారీ వసూళ్ల అందుతుండటంతో జిల్లాస్థాయి అధికారులు నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు చెబుతున్నారు.

భారీ మొత్తంలో ముడుపులు

కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దంటూ సీఎం చంద్రబాబు పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ పలువురు ప్రజా ప్రతినిధులు తీరు మారడం లేదు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని కొందరు ప్రజా ప్రతినిధులకు ఇసుక అక్రమ అమ్మకాలు ద్వారా రోజుకి రూ.10 లక్షలు పైబడి ఆదాయం గడిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ దందా పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లకుండా ఉంటుందా అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. గత దశాబ్దకాలంతో పోలిస్తే పూర్వ పశ్చిమ తూర్పు గోదావరి జిల్లాలలో భవన నిర్మాణాలు ఘననీయంగా తగ్గాయి. గడిచిన ఏడాది కాలంగా వ్యక్తిగత భవన నిర్మాణాలు కొంచెం మెరుగుపడినప్పటికీ అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌లు నిర్మాణం గణనీయంగా తగ్గింది. దీంతో ఇసుక అమ్మకాలు సాఫీగానే సాగుతున్నాయి. అయినప్పటికీ అక్రమ వసూళ్లు ఆగలేదు. గోదావరికి వరద రావటానికి ముందు సేకరించి గట్లపై నిల్వ ఉంచిన ఇసుకకు ఐదు యూనిట్లు రూ.2 వేలు వసూలు చేస్తే సరిపోతుందని రూ.8, 9 వేలు వసూలు చేస్తున్నారని పలువురు లారీ యజమానులు వాపోతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

జగన్ ప్రభుత్వంలో అష్టకష్టాలు పడ్డామని కూటమి ప్రభుత్వం వచ్చినా తమ కష్టాలు తీరలేదని టిప్పర్ లారీ అసోసియేషన్ నాయకులు చెప్పారు. జగన్‌రెడ్డి పాలనలో అధిక ధరలకు ఇసుక అమ్మినప్పటికీ అన్ని ప్రాంతాలలో ఒకే ధర ఉండేదని ఇప్పుడు ర్యాంపుల వద్ద స్థానికులు పొంతన లేని ధరలతో తమను ఇబ్బంది పెడుతున్నారని లారీ యజమానులు చెబుతున్నారు. రూపాయి ఖర్చులేకుండా ఇసుక ద్వారా కొందరు ప్రజాప్రతినిధులు కోట్లాది రూపా యలు గడుస్తుంటే తమకు కిరాయిలు కిట్టుబాటు కాక లారీలను అమ్ముకునే పరిస్థితి వచ్చిందని పలువురు టిప్పర్ లారీ యజ మానులు ఆందోళన చెందుతున్నారు. అక్ర మంగా ఇసుక అమ్ముతుంటే పట్టించుకోని అధికారులు ఓవర్ లోడు, లేదా బిల్లు లేదంటూ జిల్లాలో రోజుకి నాలుగు ఐదు కేసులు రాస్తున్నారన్నారు. టిప్పర్ లారీల మనుగడ కొనసాగాలంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇసుక అక్రమ అమ్మకాలు ద్వారా ఎవరు ఎంత వెనకేసుకున్నారనే అంశంపై ప్రభుత్వానికి ఇప్పటికే సమాచారం ఉందని సీఎం చంద్రబాబు ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నారని క్రమశిక్షణా చర్యలు ఉంటాయని ఒక ప్రజాప్రతినిధి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

నెక్లెస్ బండ్‌కి రక్షణేది ?



రక్షణ చర్యలు చేపట్టాల్సిన నెక్లెస్ బండ్ ప్రాంతం

వరదల సమయంలో పోలవరం వాసులు బిక్కు..బిక్కు
అసంపూర్తిగా రక్షణ పనులు

పోలవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ వల్ల గ్రామంలో వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నెక్లెస్ బండ్‌కి పూర్తి స్థాయిలో రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల స్పిల్వే నుంచి విడుదలవుతున్న గోదావరి వరద జలాలు నేరుగా రాళ్ళతో రక్షణ గట్టు వేసిన పురుషోత్త పట్నం రేవుని తాకి వేగంగా పోలవరం నెక్లెస్ బండ్‌ని తాకడం వల్ల బంకమన్నుతో వేసిన నెక్లెస్ బండ్ కోతకు గురవుతూ వస్తున్నది. దీని వల్ల ప్రతి ఏటా వరదల సమయాలలో గ్రామస్థులు ప్రాణభయంతో ప్రాణాలు గుప్పిట పెట్టుకుని గడిపేవారు. 2021-2022 సంవత్సరాలలో వచ్చిన వరదలకు ప్రాజక్టు అధికారులు నెక్లెస్ బండ్‌కి కొంతమేర రాళ్ళతో రక్షణ ఏర్పాటు చేశారు. మూడున్నర కిలోమీటర్ల మేర ఉన్న నెక్లెస్ బండ్‌కి కేవలం రెండు కిలోమీటర్ల మేర మాత్రమే రక్షణ చర్యలు చేపట్టారు. మిగిలిన ఒకటిన్నర కిలోమీటర్ల మేర వదిలేశారు. దీంతో 2022, 2023, 2024 వరదలకు యడ్లగూడెం, కమ్మరగూడెం ప్రాంతాల్లో ప్రజానీకం భయాందోళనకు గురయ్యారు. అధికారులు ఇసుక బస్తాలు, వెదురు తడికలతో ఆయా ప్రాంతాలలో రక్షణ చర్యలు తాత్కాలికంగా చేపట్టారు. వరద నీటిని డీవాటరింగ్ ద్వారా గోదావరిలోకి నెలల తరబడి ఎత్తిపోసే పరిస్థితులు నెల కొన్నాయి. ప్రతి ఏటా గ్రామంలో 40 శాతం నివాసాలు వరద నీటిలో దోమలతో, రోగాలతో ఇబ్బందులకు గురవున్నారు.

చేయవలసిన నిర్మాణాలేంటి :

నెక్లెస్ బండ్ పనుల ప్రణాళికలో ముందుగా కడమ్మ స్లూయిజ్ స్థానంలో వెడల్పైన మరో పెద్ద స్లూయిజ్ నిర్మాణం, కమ్మర గూడెం, యడ్లగూడెం ప్రాంతాల్లో మరో రెండు స్లూయిజ్‌ల నిర్మాణం చేయవలసి ఉంది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆ పనులను అలానే వదిలేశారు. కడమ్మ స్లూయిజ్ పెద్దగా కొత్తది నిర్మాణం చేయడం వల్ల ఏటిగట్టుకి కుడివైపు కొండవాగుల జలాలు నేరుగా గోదావరిలోకి పోయి ప్రతి ఏటా 2 వేల ఎకరాల పంటభూములు నీటమునిగే ప్రమాదం తప్పుతుంది. కమ్మరగూడెం, యడ్లగూడెం గ్రామాల వద్ద స్లూయిజ్‌ల నిర్మాణాల వల్ల గ్రామంలో మురుగు నీరు, వర్షం నీరు గోదావరిలోకి పోయి వరదల సమయాల్లో గ్రామానికి ముంపు బెడద తప్పుతుంది.నెక్లెస్ బండ్ వెంబడి గ్రామం లోపల మేజర్ డ్రైనేజీ నిర్మించాలి..ఆ పనులను కూడా అధికారులు పక్కన పెట్టారు.దీని వల్ల గ్రామంలో మురుగు నీరు బయటకు పోయే మార్గం లేక నెక్లెస్ బండ్ వెంబడి ఉన్న నివాసాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఏమిటి ?

నెక్లెస్ బండ్ కి ఒకటిన్నర కిలోమీటర్ల మేర వరదలకు పలుచోట్ల కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రేవులకు వెళ్లే మార్గాలు లేకపోవడం వలన ఎవరైనా చనిపోతే దహన కార్యక్రమాలు చేయడానికి వీలులేక నెక్లెస్ బండ్ ఎక్కి దిగడానికి వీలపడక మృతదేహాలను కొవ్వూరు, వేగేశ్వరపురం శ్మశాన వాటికలకు తీసుకువెళుతున్నారు. గ్రామంలో వాడుక నీరు బయటకు పోవడానికి మేజర్ డ్రైనేజీ లేక నెక్లెస్ బండ్‌కి పొడవునా ఉన్న నివాసాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. వర్షాల సీజనులో యడ్లగూడెం వద్ద నిలిచిన గ్రామంలో మురికి నీటిని వర్షపు నీటిని పంచాయతీ అధికారులు మోటార్లతో తోడించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.గ్రామంలో బెస్తావీధి, కమ్మరగూడెం, నూతనగూడెం గ్రామాలు ముంపు బారిన పడి దోమలు, దుర్గంధంతో అనారోగ్యాలపాలవుతున్నారు.

నిర్మాణం జరిగిందిలా :


2007లో నెక్లెస్ బండ్ నిర్మాణంలో కడమ్మ స్లూయిజ్, కమ్మరగూడెం, యడ్లగూడెం స్లూయిజ్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు జరిగాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం గ్రామానికి రక్షణగా 2011లో కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో నెక్లెస్ బండ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. 2013 సంవత్సరంలో నెక్లెస్‌బండ్ పనులు పలు కారణాల వల్ల ఆగింది. 2017-2018 సంవత్సరాలలో మూడున్నర కోట్ల రూపాయల వ్యయంతో నెక్లెస్‌బండ్ నిర్మాణం పూర్తి చేశారు. 2021-2022 సంవత్సరాల్లో 1.5 కోట్లతో ఒక ఏడాది, 90 లక్షల వ్యయంతో మరో ఏడాది రాళ్లతో రక్షణ చర్యలు చేశారు.

అధికారులు ఏం చెబుతున్నారు

ఈ విషయంపై అఖండ గోదావరి రివర్‌బండ ఏఈ మణికంఠ మాట్లాడుతూ రక్షణ చర్యలు చేపట్టవలసిన ప్రాంతంలో నిర్మాణానికి 8 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కడమ్మ స్లూయిజ్ వద్ద కొండవాగుల నీటిని ఎత్తి గోదావరిలో పోయడానికి 45 కోట్లతో లిఫ్టు నిర్మాణానికి, నెక్లెస్ బండ్‌కి వరదల ప్రమాదాల నివారణకు , గ్రామంలో నీటిని ఎత్తిపోయడానికి 15 లక్షల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 2024 అక్టోబరు నెలలో సెంట్రల్ డిజైన్ ఆర్గనేజేషన్ బృందం కడమ్మ స్లూయిజ్‌ని పరిశీ లించిందని, గోదావరిపై ఉన్న అన్ని స్లూయిజ్‌లను ఆ బృందం పరిశీలించి వెళ్లిందని తెలిపారు. ప్రతిపాదనలకు అప్రూవల్ వచ్చిన తర్వాత నిర్మాణాలు చేపడతామన్నారు.

నిలువ నీడ లేకుండా చేస్తున్నారు !

పోలవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో కన్నాపురం అడ్డరోడ్డు నుంచి కన్నాపురం వరకూ రోడ్డుకి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను రహదారులు భవనాల శాఖ అధికారులు నరికించి వేయడంతో బాటసారులకు, పాదచారులకు, వ్యవసాయ కూలీలకు నిలువ నీడ లేకుండా పోయింది. జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకూ నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో రోడ్ల విస్తరణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో జీలుగుమిల్లి నుంచి కన్నాపురం అడ్డరోడ్డు వరకూ ఉన్న 60 సంవత్సరాల చరిత్ర గలిగిన భారీ వృక్షా లను కటింగ్ మిషన్లతో కట్ చేయించి వాహ నాలపై తరలిస్తున్నారు. వ్యవసాయ కూలీలకు, రైతులకు ఈ చెట్లు నీడనిచ్చేవి. పర్యావరణానికి మంచిగాలినిచ్చి ఎండవానలకు నీడనిచ్చే భారీ వృక్షాలను నరికించడం పట్ల పలువురు వృక్షప్రియులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.నూతన రోడ్లకు ఇరువైపులా త్వరితగతిన పెరిగి నీడనిచ్చే మొక్కలను నాటి పర్యావణ పచ్చదనాన్ని కాపాడాలని కోరుతున్నారు.



కన్నాపురం అడ్డ రోడ్డు సమీపంలో నరికి వేసిన భారీ వృక్షాలు

మైన్స్ విజిలెన్స్ స్క్వాడ్ ఏడీ రవికాంత్ మృతి



ఏలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : గనులశాఖ రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ (తూర్పు, పశ్చిమ కృష్ణా) అసిస్టెంట్ డైరెక్టర్ రవికాంత్ (56) ఏలూరులో గుండెపోటుతో కన్నుమూశారు. ఈయన స్వగ్రామం రాజమండ్రి. ఇతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. నర్సీపట్నంలో పనిచేస్తూ గతేడాది బది లీల్లో ఏలూరు జిల్లాకు వచ్చారు. సోమవారం సాయంత్రం తన మోటారు వెహికల్‌పై వస్తూ శనివారపుపేట లోబ్రిడ్జిలో పడిపోయినట్లు చెబుతున్నారు. చాలా సేపటి తర్వాత అతన్ని చూసి ఏలూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. ఈయన లివర్ సంబంధిత సమస్యతో సతమతం అవుతూ నెలరోజుల నుంచి సెలవులో ఉన్నట్లు చెబుతున్నారు. రవికాంత్ మృతదేహాన్ని స్వగ్రామం రాజమండ్రికి రాత్రి తరలించారు.



కప్పలకుంటలో క్షుద్రపూజలు జరిగినట్టు ఉన్న ప్రాంతాన్ని చూస్తున్న గ్రామస్థులు. గొయ్యిలో కోడిగుడ్డు , పసుపు కుంకుమ..

కప్పలకుంటలో క్షుద్ర పూజల కలకలం

ద్వారకాతిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కప్పలకుంటలో సోమవారం క్షుద్రపూజల కలకలం రేగింది. గ్రామానికి చెందిన రైతు నక్కా వెంకన్నబాబు అనే శ్రీను గతంలో హత్యకు గురయ్యాడు. అలాగే అతని కుమారుడు సైతం గత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకన్నబాబు పొలంలోనూ అలాగే అతడి ఇంటి పక్కన ఈ పూజలు జరుగుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా రాత్రివేళ ఎవరో తమ గ్రామంలో తిరుగుతున్నట్లు కొందరు చెబుతున్నారు. రాత్రివేళలో బయటకు రావాలంటేనే భయం వేస్తుందని ఈ ఘటనపై పోలీసులు వెంటనే చర్యలు చేపట్టాలని కప్పలకుంట గ్రామస్థులు కోరుతున్నారు. ఇళ్లు, పొలాల్లో గుంటలు తవ్వి నిమ్మకాయలు, కోడిగుడ్లు, పసుపు, కుంకుమ, ఎండుమిరప కాయలు, బొగ్గులు వేసి క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రోన్ కెమెరాకు చిక్కిన గంజాయి బ్యాచ్

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఏలూరు కండ్రికగూడెం ప్రాంతంలో నిర్మానుష్య ప్రదేశంలో ఐదుగురు వ్యక్తులు గంజాయి తాగుతున్నట్లు డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ పౌరుల భద్రత కోసం పోలీస్ విభాగం అధునాతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుంటుందన్నారు. డ్రోన్ కెమెరాతో ప్రతి మారుమూల ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపేందుకు ఇది తొలి అడుగన్నారు. ఏలూరు జిల్లాలో శాంతి భద్రతలు పటిష్టంగా కొనసాగుతున్నాయని ప్రజల సహకారంతో మరింత పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ కెమెరాలో చిక్కిన వీడియోల ఆధారంగా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈగల్ ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు నెలల చిన్నారి నోబుల్ వరల్డ్ రికార్డు



గణపవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామానికి చెందిన అద్దంకి జాన్‌పీటర్ కుమార్తె క్వీనీ నోబుల్ వరల్డ్ రికార్డు సాధించటం అభినందనీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు అన్నారు. ఏడు నెలల చిన్నారి క్వీని 262 ఫ్లాష్ కార్డులు గుర్తించడంలో నోబుల్ వరల్డ్ రికార్డు సాధించిందని తండ్రి తెలిపారు. జాన్‌పీటర్ దంపతులు సోమవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు తాడేపల్లిగూడెం సాధకులు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర పోటీల్లో తాడేపల్లిగూడెంకు చెందిన సత్యసాయి సేవా మందిరం యోగామండలి నుంచి వెళ్లిన యోగా సాధకులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6వ తేదిన అమలాపురం రోటరీక్లబ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తాడేపల్లిగూడెంకు చెందిన మహిళల విభాగంలో అడ్డగళ్ల ఉషశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి, బాలుర విభాగంలో పాలూరి చిరంజీవి ప్రథమ స్థానం, బాలికల విభాగంలో యర్రంశెట్టి తేజస్వి‌లు నాలుగో స్థానం, పాలూరి అభినందిని ఐదో స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 9, 10 తేదిల్లో జరిగే జాతీయస్థాయి సౌత్ ఇండియన్ పోటీలకు అర్హత సాదించారు.వారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, యోగా కోచ్ బడుగు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అభినందించారు.

పొలమూరు పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈవో



పెనుమంట్ర, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలం పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉమ్మడి జిల్లా సీఈవో శ్రీహరి సోమవారం మధ్యాహ్నం సందర్శించారు.20 ఏళ్ల క్రితం మండా సుబ్బలక్ష్మి 20 సెంట్లు పొలాన్ని పాఠశాల గ్రౌండ్ నిమిత్తం ఇచ్చారు. ఆ భూమి రెవెన్యూ రికార్డులో నమోదు కాకపోవడంతో నా భూమి నాకు ఇవ్వాలంటూ సుబ్బలక్ష్మి జాయింట్ కలెక్టర్‌ని కోరారు. స్కూల్‌కి ఆ భూమి అవసరమా లేదా అనేది నివేదించాలని కోరడంతో సోమవారం జడ్పీ సీఈవో సందర్శించారు. మండల తాసిల్దార్ వై.రవికుమార్ ఎంపీడీవో ప్రభాకర్ రావు, సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, కార్యదర్శి సీతారామయ్య హెచ్ఎం బీడీఎస్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరుపాడులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

కాళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలం ఏలూరుపాడులో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. గ్రామంలోని ఆలయాలు, స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీటి పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో పలు గృహాలను పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నదీ, లేనిదీ..? ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కూరగాయలు, పండ్లు పెంచుతున్నారా ?లేదా అనే అంశాలను సర్వే చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్ జగ్గరాజు, బృంద సభ్యులు రవికిరణ్, సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి అరుణాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఫణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలలు!



- గ్రామ/వార్డు సచివాలయ ఏఎన్ఎంల బదిలీల్లో తప్పిదాలకు బాధ్యులెవరు ?
- తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు రిలీవ్ కావద్దని మౌఖిక ఆదేశాలు
- ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సిత్రాలెన్నో

ఏలూరు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌పై నీలినీడలు అలుముకున్నాయి. బదిలీలకు ఉన్నతాధికారులు విధించిన తుదిగడువు ముగిసిన తర్వాత జూమ్ విధానంలో అంతా పారదర్శకంగానే కౌన్సెలింగ్‌ను జరిపించినట్టు బీరాలుపలికిన ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్యశాఖ వైఫల్యాలు తాజా పరిణామాలతో మరో దఫా రుజువయ్యాయి. ఈనెల 5వ తేదీనే బదిలీల కౌన్సెలింగ్ ముగిసినట్టుగా పేర్కొన్న వైద్యశాఖాధికారులు ఆ మేరకు నూతన స్థానాలను కోరుకున్న ఏఎన్ఎంలు విధుల్లో చేరేందుకు ఈనెల 13వ తేదీ అని ఉత్తర్వులు జారీచేయగా, అంతలోనే వందల సంఖ్యలోనే ఆర్డర్లలో తప్పులు దొర్లినట్టు ఆరోపణలు వస్తుండడంతో అప్రమత్తమైంది. సోమవారం పాతస్థానాల్లో విధుల నుంచి రిలీవై, ఆ వెంటనే నూతనస్థానాల్లో బాధ్యతల్లో చేరాల్సి ఉండగా, ఎవరినీ విధులనుంచి రిలీవ్ చేయడంగాని, కొత్త సచివాలయాల్లో చేరడంగాని చేపట్టవద్దని మౌఖిక ఆదేశాలను శరవేగంగా జారీచేసింది. మరోవైపు ఆదివారమే బదిలీ ఆర్డర్ల జాబితాను పరిశీలించుకున్న పలువురు ఏఎన్ఎంలు తమ పేర్లు తప్పుగా ఆర్డర్లలో ఉండడం, కొందరికి రెండు, మూడుస్థానాలను కేటాయించినట్టుగా ఉత్తర్వుల్లో రావడం, మరికొందరికి ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాలనే మళ్లీ కొనసాగిస్తున్నట్టుగా పేర్కొనడం, తదితర లోపాలను గుర్తించి ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయానికి పదుల సంఖ్యలో తరలిరావడం గమనార్హం. ఇలా జాబితాల్లో గందరగోళం తలెత్తడంతో వాటిపై ఫిర్యాదులు/అభ్యర్థనలతో కార్యాలయానికి సోమవారం సాయంత్రానికి విచ్చేసిన ఏఎన్ఎంల సంఖ్య రెట్టింపు అయింది. కొందరైతే డీఎంహెచ్‌వో కార్యాలయంలో మేనేజ్ చేసుకుని ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలోనే జీవో ఐదు నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు పొందగా, మరికొందరైతే పక్కనేవున్న సచివాలయానికి మొక్కుబడి బదిలీగా వెళ్లారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటువంటివి చాగల్లు, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, పోలవరం, టి.నరసాపురం, తదితర మండలాల్లో చోటుచేసుకున్నాయని తెలుస్తోంది. బదిలీల్లో జరిగిన తప్పిదాలకు వైద్యఆరోగ్యశాఖలో బాధ్యులెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కౌన్సెలింగ్‌కు అవసరమైన సమగ్ర సమాచారాన్ని దగ్గరుంచుకుని, అర్హత/అనుభవం వున్నవారితో బదిలీలు నిర్వహించడానికి బదులు కార్యాలయంలో పలువురు సొంతభాష్యాలతో జరిపించడంవల్లే క్రమంతప్పి చివరకు ఈ పరిస్థితివచ్చిందని సమాచారం.

అంతా అయోమయమే

ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్య శాఖ గతనెల 28న విడుదలచేసిన గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలు మొత్తం 799మంది ఉన్నట్టుగా నిర్ధారించారు. జీవో నంబరు ఐదు ఉత్తర్వులప్రకారం గ్రామీణ ప్రాంత సచివాలయ ఏఎన్ఎంలను సొంత మండలపరిధిలో బదిలీ చేయరాదని మార్గదర్శకాలు ఉన్నట్టు చెబుతున్నారు. దీనికనుగుణంగానే ఉమ్మడి జిల్లాలోని ఏఎన్ఎంలను ఏజెన్సీ, రూరల్, అర్బన్ ప్రాంత సచివాలయాల పరిధిలో విభజించి బదిలీల కౌన్సెలింగ్‌ను మూడు దఫాలుగా వేర్వేరురోజుల్లో నిర్వహించారు. సీనియార్టీని ఉమ్మడి జిల్లా అంతటికీ వర్తించేలా రూపొందించగా, కౌన్సెలింగ్‌ను మాత్రం మూడు భాగాలుగా విడగొట్టి నిర్వహించడం వల్లే రోస్టర్/ర్యాంకు, సీనియార్టీల్లో వ్యత్యాసాలు తలెత్తాయని తెలుస్తోంది. ఈ కారణంగానే బదిలీ ఐచ్ఛికాల కోసం ఒకొక్క ఏఎన్ఎంనుంచి 3-5 వెకెన్సీలకు ఆప్షన్లు తీసుకున్నప్పటికీ పలువురికి కౌన్సెలింగ్‌లో సంబంధిత స్థానాలు లేకపోవడం లేదా డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందికే తెలియకపోవడం జరిగాయని సమాచారం. మరోవైపు గ్రామ/వార్డు సచివాలయాలవారీగా వెకెన్సీల సమగ్ర వివరాలు పూర్తిస్థాయిలో ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల వద్ద లేకపోవడంవల్ల కూడా పలువురికి రెండు, అంతకంటే ఎక్కువస్థానాలు ఖరారయ్యాయి. సీనియార్టీ జాబితా ప్రకారం ఏఎన్ఎంల బదిలీలను సీరియల్ సంఖ్యలో పిలవకుండా పలువురిని చివరివరకు నిలిపివేయడం గందరగోళానికి మరింత అవకాశం ఇచ్చింది.

దిద్దుబాటా ? రీ-కౌన్సెలింగా ?

ఉమ్మడి జిల్లాలో ఐదేళ్ల స్టేషన్ సీనియార్టీ వున్న 799మంది ఏఎన్ఎంల బదిలీలకుగాను, వేర్వేరుగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో రూరల్ సచివాలయాల ఆర్డర్లు 593మంది, అర్బన్ ఆర్డర్లు 165మంది పేర్లతో కూడిన జాబితాలు ఉన్నాయి. వీటితోపాటు ఏజెన్సీ మండలాల ఏఎన్ఎంల ఆర్డర్లు కూడా ఉంటాయి. ఆదివారం విడుదలచేసిన బదిలీల ఆర్డర్లను సవరణలు, దిద్దుబాట్లు, అదనపు మార్పులకోసం నిలిపివేయడంతో కొత్తగా జరుగనున్న మార్పులపై క్షేత్రస్థాయిలో అసంతృప్తులు, అభ్యంతరాలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఆ మేరకు కౌన్సెలింగ్‌లో నూతన స్థానాలు ఖరారైన వారిలో కొందరికి విధుల్లో చేరకుండానే స్థానభ్రంశం తప్పక పోవచ్చని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొందరు ప్రజాప్రతిధులు ఇచ్చిన సిఫారసు లేఖలను తాజాగా పరిగణనలోకి తీసుకుని, బదిలీ ఆర్డర్లలో కొందరికి మార్పులుచేసే అవకాశమూ లేకపోలేదని సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామ/వార్డు సచివాలయాల గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతారా లేక రీ-కౌన్సెలింగ్ చేపడతారా అనే డైలమా నెలకొంది. తాజా పరిణామాలపై వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. జిల్లానుంచి బదిలీపై వెళ్లిపోయిన అధికారి పాలనలో జరిగిన ఏఎన్ఎంల కౌన్సెలింగ్ తప్పిదాలను సరిదిద్దడం ఇపుడున్న అధికారులకు ఒకింత సవాల్‌కాగా, కొందరు ప్రజాప్రతినిదుల సిఫారసులను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేయాల్సి రావడం తలనొప్పిగా పరిణమించిందని ప్రచారం జరుగుతోంది.

నరసాపురం లేసు ప్రొడక్ట్స్‌కు 'ఓడీఓపీ' అవార్డు

- న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన కలెక్టర్ నాగరాణి



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నరసాపురం లేసు ప్రొడక్ట్స్ .. ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) అవార్డుకు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఓడీఓపీ అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ చేతులు మీదుగా పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అవార్డును అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఏడు ఉత్పత్తుల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్‌కు అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబరు 25న న్యూఢిల్లీలోని హోటల్ ఒబెరాయ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వర్క్ షాప్‌లో కలెక్టర్ నాగరాణి పాల్గొని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతులు మీదుగా (జీఐ) సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సాపూర్ లేస్ అల్లికలకు గత ఏడాది జీఐ గుర్తింపు రావడం, నేడు ఓడీఓపీ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని, లేసు తయారీదారులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర మంత్రి ఎస్.సవిత, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, ఐఏఎస్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, ఓడిఓపీ అవార్డుకు ఎంపికైన జిల్లాల కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.64 లక్షలు రికవరీ

- ఏపీకే ఫైల్ లింక్ ఓపెన్ చేయడంతో సైబర్ నేరగాళ్లు నగదు దోచేశారు..
- నగదు రికవరీ చేసి బాధితుడికి అందించిన ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్



బాధితుడికి నగదును అందిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసానికి గురైన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు నగదును రికవరీ చేయడంతో ఆయనే స్వయంగా బాధితుడికి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అందించారు. కైకలూరు మండలం కామరకొల్లు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శ్రీనివాసరావు మొబైల్‌కు ఇటీవల సోషల్ మీడియాలో ఏపీకే ఫైల్ ఒకటి వచ్చింది. ఆ లింకులు ఈ ఏడాది మే 13న ఓపెన్ చేయడంతో బ్యాంకు ఖాతా నుంచి లక్షా 64 వేల రూపాయలు మోసపూరితంగా సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈమేరకు బాధితుడు అప్రమత్తమై బ్యాంక్ అధికారులతో పాటు, కైకలూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణను సంప్రదించారు. కైకలూరు టౌన్ పోలీసులు సైబర్ విభాగం సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. బాధితుడు పోగొట్టుకున్న లక్షా 64 వేల రూపాయలను తిరిగి రికవరీ చేయడంతో జిల్లా ఎస్పీ కిశోర్ స్వయంగా బాధితుడికి అందించారు. పోలీసు అధికారులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక కాలంలో సైబర్ నేరగాళ్లు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్నారని ఫోన్లలో వచ్చే ఏపీకే ఫైల్స్ కాని లింకులు కాని ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవ్వరికి చెప్పకూడదని సూచించారు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే లింకులపై స్పందించవద్దని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

యూకేజీ విద్యార్థులపై ప్రిన్సిపాల్ శాడిజం

- సిరంజితో పొడిచి, అగ్గిపుల్లలో కాల్చి



పాలకొల్లు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శాడిజంతో ఇద్దరు యూకేజీ విద్యార్థులపై దాష్టికం ప్రదర్శించిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల పాఠశాలలో గత బుధవారం ఇద్దరు చిన్నారులపై అగ్గిపుల్లతో వాతలు పెట్టడంతో పాటు సిరంజితో పొడిచి గాయాలు చేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. సోమవారం స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. గత బుధవారం తరగతిలో డాక్టర్ - పేషెంట్ అనే ఈవెంట్‌ను వైస్ ప్రిన్సిపాల్ నిర్వహిస్తూ చేతి రాత బాగోలేదని ఇద్దరు యూకేజీ విద్యార్థులను కర్రతో తలపై కొట్టడంతో పాటు సిరంజిత్ చేతిపై పొడిచి, అగ్గిపుల్లతో చేతులపై కాల్చి భయపెట్టడంతో ఆ చిన్నారులు వారి వారి ఇండ్లలో తల్లిదండ్రులకు చెప్పారు. శని, ఆదివారం సెలవు కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యంను ప్రశ్నించడంతో యాజమాన్యం వైస్ ప్రిన్సిపాల్‌ని ప్రశ్నించగా బుకాయించి, తనకేమీ తెలియదని చెప్పడంతో యాజమాన్యం వైస్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈవిషయమై తమకు ఏవిధమైన ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

అనారోగ్య సమస్యలు తాళలేక వృద్ధుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన తోలేటి సత్యనారాయణ(60)అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అయితే సోమవారం ఉదయం పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.వెంటనే బంధువులు భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సత్యనారాయణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు తెలిపారు.

జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు బాలలు పరార్

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): చట్టంలో విభేదించిన ఐదుగురు బాలలు ప్రభుత్వ సత్ప్రవర్తన పర్యవేక్షణ వసతి గృహం నుంచి పరారయ్యారు. భీమవరం నుంచి ఇద్దరు, జంగారెడ్డిగూడెం నుంచి ఒకరు, దువ్వ నుంచి ఒకరు, తాడేపల్లిగూడెం నుంచి ఒకరు చట్టంతో విభేదించిన బాలలను ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ సత్ప్రవర్తన పర్యవేక్షణ వసతి గృహంలో ఉంచారు. వారిపై బాల నేరస్థులుగా కేసులున్నాయి. 13వ తేదీ రాత్రి వారు ఆ హోమ్ నుంచి పరారయ్యారు. వారి కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాకపోవడంతో హోం సూపరింటెండెంట్ శ్రీవల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కడుపునొప్పి తాళలేక రైతు ఆత్మహత్య



నూజివీడు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవరకొండ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పల్నాటి రామకృష్ణ (32) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడు కలుపు ముందును సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు నూజివీడు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నూజివీడు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

- కఠిన చర్యలు తీసుకోవాలంటూ బంధువుల ఆందోళన



మహిళలతో మాట్లాడుతున్న సీఐ అశోక్

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : పద్నాలుగేళ్ల బాలికపై 75 ఏళ్ళ వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడటంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక 7వ తరగతి చదువుతోంది. ఆమె తల్లి దండ్రులు వేరే పనులకు వెళ్లడం వల్ల బాలిక ఉదయం 9 గంటలకు స్కూలుకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు వస్తోంది. ఆ తరువాత అమ్మమ్మ ఇంటికి వెళ్తోంది. తల్లిదండ్రులు వచ్చిన తరువాత ఆ బాలికను ఇంటికి తీసుకొస్తారు. ఆ బాలిక అమ్మమ్మ ఇంటికి రోజూ వెళ్తున్న సమయంలో ఏలూరు కొత్తపేట నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన తిర్రి సూర్యనారాయణమూర్తి(75) అనే వృద్ధుడు మాయ మాటలు చెప్పి వారం నుంచి తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక వేధిపులకు పాల్పడుతున్నాడు. జరిగిన ఘటనను కుటుంబ సభ్యులకు బాలిక చెప్పడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే వృద్ధుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వదిలివేశారంటూ బాధితులు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. వృద్ధుడు తమ అదుపులోనే ఉన్నాడని ఒక మహిళను తీసుకెళ్లి చూపించడంతో వారు శాంతించారు. టూటౌన్ సీఐ ఎస్.అశోక్ కుమార్, ఎస్ఐ మధువెంకటరాజా బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

లిఫ్టు ఇస్తామని దోపిడీ.. పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ఏలూరుక్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామున లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని మార్గమధ్యలో దాడిచేసి గాయపర్చి నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్ అపహరించుకుపోయాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కైకలూరుకు చెందిన సాదర్ల బ్రహ్మం(39) హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. తన ఇంటికి వెళ్లే నిమిత్తం హైదరాబాద్ నుంచి రైల్లో ఈనెల 13వ తేదీ తెల్లవారు జామున 3.30 గంటలకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడ నుంచి కైకలూరు వెళ్ళే నిమిత్తం మార్కెట్ రోడ్డులోని అజంతా సెంటర్‌లో నిలబడి ఉండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగారు. తాము కూడా అటే వెళ్తున్నామని నమ్మబలికి లిఫ్టు ఇస్తామని నమ్మబలికి ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో వైఎస్ఆర్ కాలనీ వద్ద తమ్మిలేరు రోడ్డునకు తీసుకుపోయి అతనిపై దాడి చేసి గాయపరిచారు. అతని వద్ద ఉన్న 5,500 నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌ను అపహరించుకుపోయాడు. బాధితుడు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దోపిడీకి పాల్పడింది ఇద్దరే అయినా ఈ గ్యాంగ్ ఐదుగురు ఉన్నట్టు పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



బిల్డింగ్ పై నుంచి పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న ఒక బిల్డింగ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు జిల్లా పలకలూరికి చెందిన గౌరెడ్డి ధనకుమార్ (40) ఏలూరు గొల్లాయిగూడెంలోని మానేపల్లి చెందు ఇంటి వద్ద ఉంటూ జీవిస్తున్నాడు. చెందు ఇంటి నిర్మాణంలో పనులు చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ నెల 13వ తేదీ రాత్రి బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్ర గాయాలకు గురికావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మొగల్తూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాళీపట్నం 216 జాతీయ రహదారి రంగాబొమ్మ సెంటర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం బాడవ గ్రామానికి చెందిన గెల్లు సాయి కుమార్ వ్యాన్ నడుపుకుంటూ మొగల్తూరు వైపు వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన లారీ రంగా బొమ్మ సెంటర్‌లో ఢీకొంది. ఈఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు చెయ్యికి, తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని మొగల్తూరు పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు

టి.నర్సాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ (64) గత కొంత కాలంగా బీపీ, సుగర్‌తో బాధపడుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సమీప బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకి తెలియకపోవడంతో భార్య షేక్ మాబుసుభాని ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్ చోరీ

టి.నర్సాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాపర్ వైర్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. టి.నర్సాపురం గ్రామ శివారులో బొబ్బిలి వెంకటేశ్వరరావు పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి విలువైన కాపర్‌వైర్‌ను చోరీ చేశారు. విద్యుత్ శాఖ ఏఈ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.

గొంది‌లో రెచ్చిపోయిన దొంగలు

- రెండు ఇళ్లు, ఆలయాల్లో చోరీ

నరసాపురంరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంది గ్రామంలో ఆదివారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. రెండు ఇళ్లు, రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. మూడు కాసుల బంగారం, 25 తులాల వెండి, రూ.50 వేల నగదును దొంగలు దోచుకుపోయారు. శీలబోయిన దేసింగరావు, నాగేశ్వరరావుల ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. వీరిలో ఒకరు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తాళం పగలగొట్టి బీరువాలోని బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే మరో బాధితుడు ఇంట్లోని పక్క గదిలో పడుకోగా.. బీరువా గదిలోకి చొరబడి వెండి, నగదు దోచుకెళ్లారు. ఆలయాల తలుపులు పగలగొట్టగా అందులో ఏమీ దొరకలేదు. ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్.ఐ. వెంకట సురేశ్ సిబ్బందితో గ్రామానికి వెళ్లి చోరీ తీరును పరిశీలించారు. భీమవరం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ అదుపు తప్పి కాలువలో పడి ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు నవాబుపేటనకు చెందిన అలిగి కిరణ్(22) ఐటీఐ చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తన స్నేహితులతో కలిసి దెందులూరు మండలం కొవ్వలిలోని స్నేహితుడి వద్దకు ఈనెల 13న వెళ్లి అర్ధరాత్రి మోటార్ సైకిల్‌పై ఏలూరు వస్తుండగా ఏలూరు పాలగూడెం రోడ్డులోని తూర్పులాకుల వద్ద స్పీడు బ్రేకర్లను తప్పించలేక అదుపుతప్పి గోదావరి కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ



కామవరపుకోట, జూలై 14(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గుర్రాలచెరువు గట్టు వద్ద ఉన్న వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం పలువురు భక్తులు తమ దోష నివారణ కోసం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. స్థానిక లలితాశ్రీ పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

ఉప్పలపాడు విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



కామవరపుకోట, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడులోని విశ్వేశ్వరాలయం వద్ద సోమ వారం భక్తులు స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివనామస్తోత్రాలను పఠించారు. అన్నపూర్ణాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. ఆలయ అర్చకులు ఇలపర్తి శివరామయ్య ప్రసాద్ భక్తులతో పూజలు చేయించారు. వారి గోత్రనామాలతో నిర్వహించిన అర్చనలతో ఆలయాల్లో సందడి నెలకొంది.

శ్రీవారిని దర్శించుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్



ద్వారకాతిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సోమవారం సందర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్.వి.నివృతరావు, అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. శ్రీవారి దర్శనానంతరం ధర్మకర్త నివృతరావు, ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తిలు ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ, ఏఈవో దుర్గారావు, టీడీపీ నేత బుజ్జి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

ఏలూరు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాల బాలికలకు ఏటా నోట్‌బుక్స్, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేసే ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం వైఎస్సార్ నగర్ ఎంపీపీ పాఠశాలలో 102 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేసింది. సంస్థ చైర్ పర్సన్ డి.యాంజిలో మాట్లాడుతూ పేద విద్యార్థులంతా క్రమం తప్పకుండా తరగతులకు హాజరై అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ఏటా విద్యా సంబంధిత కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడుతూ విద్యా సంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల పట్ల సంస్థకున్న ప్రత్యేకమైన శ్రద్ధకు ఈ కార్యక్రమాలే నిదర్శనమన్నారు. స్కూల్ హెచ్ఎం లక్ష్మి, టీచర్లు జరీనా, కిరణ్ కుమారి పాల్గొన్నారు.

రిసోర్స్‌పర్సన్ హఠాన్మరణానికి ఒత్తిళ్లే కారణం : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): శిక్షణల పేరుతో కొంతకాలంగా టీచర్లను తీవ్ర ఒత్తిడికి గురిచేయడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు జి.కృష్ణ, రామ్మోహనరావు, మోహన్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో ప్రారంభమైన ఈ లీడర్‌షిప్ శిక్షణ తరగతుల్లో పాలకొల్లు మండలం అరట్లకట్ల జడ్పీ హైస్కూలు హెచ్ఎం ఎస్.వి.ఆర్.మూర్తి విధి నిర్వహణలోనే గుండె పోటుకు గురై హఠాన్మరణం చెందడం విచారకరమన్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు ఆగిపోతాయేమోనని ఉపాధ్యాయులను శిక్షణల పేరుతో వేధిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు పాఠాలు చెప్పనీయకుండా పాఠశాల పనివేళల్లో శిక్షణలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

జాలిపూడి సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఏలూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాలిపూడి సొసైటీలో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. సొసైటీ సెక్రటరీ కల్పనా కుమారి ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మోటేపల్లి పవన్ హరిచంద్ర కుమార్, డైరెక్టర్లుగా నందిగం రమేశ్, కోడి శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, నెక్ట్‌జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, టీడీపీ మండలాధ్యక్షుడు నంబూరి నాగరాజు, నేతల రవి, చుక్క వెంకటేశ్వరరావులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

రామనర్సాపురంలో 'కిడ్నీ' సమస్య అదుపులోనే ఉంది

బుట్టాయగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని కొండరెడ్డి గ్రామం రామనర్సాపురంలో కిడ్నీ సమస్యలు అదుపులోనే ఉన్నాయని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో కిడ్నీ సమస్య నుంచి కొండరెడ్లు పూర్తిగా కోలుకున్నారని ప్రస్తుతం కాళ్ళ వాపులు, కిడ్నీ బాధితులు లేరని అన్నారు. స్వచ్ఛమైన మంచినీటిని అందించే ఏర్పాట్లు చేశామని, ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చాయన్నారు. మంచినీటిని ఎక్కువగా తీసుకోవడం చేస్తున్నారని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తున్నట్లు తెలిపారు. ఒకరిద్దరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిస్తే వెంటనే వైద్యసహాయం అందిస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే నెలలో గ్రామం మొత్తం కిడ్నీ సమస్యలతో బాధపడుతుండగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా, ఐటీడీఏ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టింది.

25వ సారి రక్తదానం చేసిన ఏసీబీ కానిస్టేబుల్



ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని కానూరు మాధవి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న ఒక మహిళకు అత్యవసరంగా బీ-నెగిటివ్ రక్తం అవసరమని ఫోన్‌రాగా ఏసీబీ కానిస్టేబుల్ పీతల కిషోర్ స్పందించారు. లింగపాలెం మండలం ముడిచర్ల గ్రామానికి చెందిన పి.భారతి అనే మహిళ ఏలూరు ఆర్ఆర్‌పేటలో కానూరి మాధవి ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం చేరారు. బి నెగిటివ్ రక్తం ఆమెకు ఎక్కించాలని వైద్యులు సూచించారు. బీ-నెగిటివ్ రక్తం అతి తక్కువ మందికి మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ రక్తం గ్రూపు కలిగిన కిషోర్ ఏలూరు వసుంధర బ్లడ్ బ్యాంక్ నుంచి ఫోన్ రావడంతో వెంటనే స్పందించి 25వ సారి రక్తదానం చేశారు. దీంతో కిషోర్‌ను పలువురు అభినందించారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో హోంగార్డుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎండీ నాగూర్ మీరావలిని ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఘనంగా సన్మానించి మెమెంటో అందించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మీరావలిని దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఎస్పీ కెపిఎస్ కిషోర్ మాట్లాడుతూ హోంగార్డు సేవలు పోలీసు విభాగానికి ఎంతో కీలకమని, పోలీస్‌శాఖకు మెరుగైన సహాయకులుగా నిలుస్తున్నారని అభినందించారు. సన్మాన కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు పలువురు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్స విజయవంతం

జంగారెడ్డిగూడెం,జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో 60 ఏళ్ల సుగర్ బాధితురాలి ఎడమ కాలికి శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించినట్టు ఆస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ సిహెచ్.బేబీ కమల సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన కవులూరి రామలక్ష్మి అనే వృద్ధురాలికి అనుభవజ్ఞులైన డాక్టర్ సుష్మ, డాక్టర్ సునీల్, డాక్టర్ వజ్రకిరణ్ బృందం ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేసినట్టు తెలిపారు. ప్రజలంతా ఏరియా ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని అన్నారు. ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంచర్ల గణేశ్, నాయుడు శ్రీను, కోటగిరి ప్రమీల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కమిటీలేవి సామీ!

(5వ పేజీ తరువాయి)

ఖాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. కొల్లేరు పెద్దింటమ్మ ఆలయ చైర్మన్ ఎవరు అని టెన్షన్‌గా ఎదురుచూస్తున్నారు. కానీ కొల్లేటి కోటకు చెందిన జల్లూరి వెంకన్న ఈ పదవికి నామినేట్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎందుకీ జాప్యం? : జిల్లావ్యాప్తంగా 89 పైగా ఆలయాలుండగా 73 దేవాలయాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో కేవలం 43 ఆలయ కమిటీలకు మాత్రమే ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారు. మిగతా 30పైగా ఆలయ కమిటీలకు సిఫార్సులు లేదా ప్రతిపాదన దేవదాయ శాఖకు అందనేలేదు. వాస్తవానికి ఆది నుంచి పార్టీ కోసం నిత్యం పరిశ్రమించిన వారు లేకపోలేదు. పార్టీపై అభిమానంతో సొంత ఖర్చులను భరించి, అసలు పనులను వదిలేసి ఫుల్‌టైమర్లగా వ్యవహరిస్తున్న వారు లెక్కకు మిక్కిలి ఉన్నారు. ఎమ్మెల్యేలు మాత్రం నామినేటెడ్ పదవుల భర్తీలో ముందడగు వేయలేకపోతున్నారు. కేవలం క్యాడర్‌లో సీనియర్లు, జూనియర్లుగా విభజన, సామాజిక వర్గాల వారీగా పోటీ తీవ్రంగా ఉండడంతో ఏడాది నుంచి ఎటూ తేల్చలేకపోయారు. ఆలయ కమిటీల్లో చైర్మన్, సభ్యులుగా నియమితులైతే కేవలం గౌరవ ప్రతిష్టలతోనే ఒక సేవగా భావించి ఆలయాల అభివృద్ధికి కష్టపడతారు. సాధ్యమైనంత వరకు సీనియర్లే ఈ పదవులను ఆశిస్తారు. సామాజికపరంగా ఈసారి తమ వారికే అవకాశం ఇవ్వాలని చాలా ఆలయాల పరిధిలో నేతలు పట్టుబడుతున్నారు. కనీసం వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం మధ్యే సయోధ్య సాధించి ఆ మేరకే ఆలయ కమిటీలను సిఫార్సు చేసి ఉండాల్సింది. స్థానిక ఎమ్మెల్యేకు కొంత మేర సిఫార్సుల ఒత్తిడి ఉండేది. ఇప్పుడు కనీసం సిఫార్సు చేయడంలో జాప్యంతో క్యాడర్‌లో అసంతృప్తి, ఆగ్రహం కనిపిస్తోంది. ఆలయ కమిటీలను ఆగస్టులో భర్తీ చేస్తారని, ఆలోపు జాబితాలను మరోసారి పరిశీలించడం, రాని వాటిని రప్పించుకోవడం జరుగుతుందని ఇంకొందరు భావిస్తున్నారు. ఆలయ కమిటీలపై ఎమ్మెల్యేలు దృష్టిపెడితే కొందరికైనా నామినేటెడ్ పదవులు దక్కుతాయి.







భీమడోలులో ఎంపీ మహేశ్, గోపన్నపాలెంలో ఎమ్మెల్యే చింతమనేని, ఏలూరులో ఎమ్మెల్యే చంటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



ఎక్స్‌రే కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్

సంక్షేమంతో సుపరిపాలన

దెందులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గోపన్నపాలెం గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లు బాబు) ఆధ్వర్యంలో సుపరిపాలనపై తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడాదిలో చేసిన పథకాలు, కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు. సానిగూడెంలో మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనుబాబుతో కలిసి నివాళులర్పించారు.అనంతరం గంగన్నగూడెంలో టీడీపీ నాయకులు వెన్నమనేని రాజాతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని మోటార్ సైకిల్‌పై గ్రామంలో పర్యటించారు. సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, తెలుగు యువత నాయకులు శివలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బ్యాంక్ అధ్యక్షులు కూచిపూడి బాబి ఏఎంసీ డైరెక్టర్లు మద్దాల దయానందరాజు, పూజారి వెంకటరత్నం నాయుడు, గారపాటి కొండయ్య చౌదరి వంశీ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించిన ఎంపీ

● భీమడోలు: రానున్న నాలుగేళ్లలో ఉంగుటూరు నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. భీమడోలులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు.

● లింగపాలెం : కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. రంగాపురంలో సర్పంచ్ ముసునూరి రాముతో కలిసి స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రంగాపురంలో స్థానిక నాయకుడికి చెందిన ఎక్స్‌రే కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రంగాపురం అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓబిళ్లనేని శేషగిరిరావు, తాడేపల్లి దాసుబాబు, బొల్లిన పుల్లారావు, బోడా అనీశ్, బోడా నాగభూషణం, మాదాసు కిరణ్, ఇనుగంటి సుధీర్‌బాబు, సుబ్బారావు, రాంబాబు పాల్గొన్నారు.

● కామవరపుకోట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి కామవరపుకోట మండలం ఉప్పలపాడు, రామన్నపాలెం గ్రామాల్లో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి బ్రోచర్లు అందచేసి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు.ఏలూరి హరిరామకృష్ణ, ఘంటా సుధీర్ బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపు సూర్య నారాయణ, నాగలింగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలు హక్కుగా భావించి సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 43వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి పాల్గొన్నారు.పార్టీ పరిశీలకులు వల్లి, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, చోడే వెంకటరత్నం, పెదబాబు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీపీఐ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు వచ్చి వివరాలు తెలియచేయాలని కోరారు.

ముస్లింలు అభివృద్ధి చెందాలి

బుట్టాయగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ సభ్యుడు షేక్ ముస్తఫా అన్నారు. సోమవారం దొరమామిడి మసీదులో దొరమామిడి, అంకన్నగూడెం, నిమ్మలగూడెం, గురుగుమిల్లి మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను డిగ్రీ వరకైనా చదివించాలని అందుకు జంగారెడ్డిగూడెం జేఏసీ బాధ్యత తీసుకుంటుందన్నారు. షేక్ బాజీ, షేక్ ఆదిల్, షేక్ పర్వేజ్, పఠాన్ సైదు ఖాన్, షేక్ అన్సర్ బాష, మీరా, మొగల్ రఫీ, పండు, మోబీనా పాల్గొన్నారు.

స్కూల్‌కు జిరాక్స్ మిషన్ అందజేత

ఉంగుటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): బాదంపూడి మోడల్ పాఠశాలకు సహోపాధ్యాయిని అరుణ కుమారి తన తల్లిదండ్రులు ముగ్గళ్ళ పుష్పకాంతం, లక్ష్మయ్యల పేరున సోమవారం రూ.20 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను అందించారు. ప్రధానోపాధ్యాయుడు రేగాని రామకృష్ణకు ఆ మిషన్ అందించారు. ఈ జిరాక్స్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా గణపతి హోమం

జంగారెడ్డిగూడెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థి సందర్భంగా రామచంద్రపురంలోని శ్రీకోదండ రామాలయంలోని ఉపాలయంలో విఘ్నేశ్వరుడికి ఆలయ అర్చకులు మద్దూరి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ గౌరవా ధ్యక్షుడు పరిమి ధర్మరాజు దంపతులు, పరిమి సత్తిపండు దంపతులు పాల్గొన్నారు.

పీఎఫ్ చెల్లింపునకు వినతి

ఏలూరు అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగర పాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు పీఎఫ్ లోన్లు, తుదిగడువు ముగిసిన పీఎఫ్ ఖాతాల్లోని నగదును చెల్లించడానికి పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపాలని అభ్యర్థిస్తూ సోమవారం కార్పొరేషన్ కమీషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వాటర్ వర్కర్లను ఆప్కాస్‌లో చేర్చండి

చింతలపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలో పనిచేస్తున్న వాటర్ వర్కర్లను ఆప్కాస్‌లో చేర్చాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆప్కాస్‌లో చేర్చకపోవడంతో చాలీచాలని జీతాలు, ప్రభుత్వం జీతాలు పెంచినా అందుకోలేకపోతున్నామని వాపోయారు. పలుమార్లు వినతులు సమర్పించామని అయినా సమస్య పరిష్కారం కావడంలేదన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

చింతలపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కెమిస్ట్రీ విద్యార్థులకు దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించారని, ఎంపికైన విద్యార్థులకు త్వరలోనే అపాయింట్‌మెంట్‌లు ఇస్తామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఉపాధి కల్పించే మార్గాలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

ఏలూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని చిత్ర పరిశ్రమకు తీరని లోటని సినీ నిర్మాతలు అంబికా కృష్ణ, అంబికా రాజా సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. చిత్ర రంగంలో కోట శ్రీనివాసరావు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో 750 సినిమాల్లో నటించి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి కలిగించాలని ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని అందించాలన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తాం

ఏలూరుటూటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టంగా నిర్మించేందుకు అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఏ.భానుప్రతాప్ ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భానుప్రతాప్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి డ్రైనేజీవ్యవస్థను పటిష్టపరిచి రోడ్ల పై నీరునిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం

సమాచారముంటే పోలీసులకు చెప్పండి

ప్రజలకు సూచించిన సీఐ సుభాష్



సీఐ సుభాష్

జంగారెడ్డిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): సర్కిల్‌లోని జంగారెడ్డిగూడెం, లక్కవరం, తడికలపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతామని సీఐ ఎం.వి.సుభాష్ హెచ్చరించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ సెటిల్‌మెంట్ల పేరుతో యువకులను వెంటపెట్టుకుని తిరిగే వారిపై, అసాంఘిక కార్యకలాలకు పాల్పడే వారిపై కేసుల నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిలు ఆడ పిల్లలను, మహిళలను వేధించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జంగారెడ్డిగూడెం, లక్కవరం తడికలపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్(94407 96627), జంగారెడ్డిగూడెం ఎస్.ఐ. (94407 96628), లక్కవరం ఎస్.ఐ. (94407 96629), తడికలపూడి ఎస్.ఐ.(94407 96678), జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్(112)కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సిఐతో పాటు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ ఉన్నారు.



సత్తిపండుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా సత్తిపండు పుట్టిన రోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పరిమి సత్తిపండు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఆయన ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్తిపండుకు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, నాయకులు పెనుమర్తి రామ కుమార్, నంబూరి రామ చంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, చేను ప్రసాద్, బోడా ఆనంద్, వట్టికూటి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ బదలాయింపులపై విచారణ చేయండి

ద్వారకాతిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొమ్మరలో కొందరు వ్యక్తులు అసైన్డ్ భూములను పలువురికి చట్టవిరుద్ధ మార్పిడిలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కలెక్టర్‌కు సోమవారం రాత పూర్వక ఫిర్యాదు చేశారు. కొమ్మరకు చెందిన పలువురు ఈ విషయంపై తనకు ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే లేఖలో పేర్కొన్నారు. అక్రమ బదలాయింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో వినతుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో ఎం.వి.రమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ లోని పలు మండలాల నుంచి ప్రజలు తమ వినతులు అందజేశారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని ఆర్డీవో రమణ పేర్కొన్నారు.

శక్తియాప్ ప్రతి ఒక్కరి మొబైల్లో ఉండాలి

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): శక్తియాప్ తమ మొబైల్లో ఉంటే పోలీసులు తమతో ఉన్నట్లేనని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ చేపట్టిన భద్రత చర్యలు, శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏలూరు సిఆర్ఆర్ మహిళా నర్సింగ్ కాలేజీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కల్పించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ మొబైల్ ఫోన్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే అత్యవసర సమయంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే పోలీస్ కంట్రోల్ రూముకు సమాచారం వెళ్తుందని,పది నిమిషాల వ్యవధిలోనే ప్రత్యేక పోలీస్ టీమ్ చేరుకుంటారని వివరించారు.

ఖాళీ టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

కుక్కునూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని సీపీఐ మండల సమితి కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య ఆరోపించారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశంలో మాట్లాడారు. సమస్యపై తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. మండల నాయకులు బాబురావు, భీమా తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వండి

ఏలూరుటూటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్త ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న విజయవాడలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, యూనియన్ కార్యదర్శి భజంత్రి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కిశోర్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● విద్యుత్ స్మార్ట్ మీటర్లపై నిరసన గళం..

ఏలూరుకార్పొరేషన్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే బషీరబాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సోమవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గోష్పాద క్షేత్రం వద్ద గల విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయవద్దని నినాదాలు చేశారు. సీపీఎం నగర కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే ప్రజా ఉద్యమాలతో సమాధానం చెబుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు వై.ఎస్.కనకారావు, ఎం.ఇస్సాకు, పి.ఆదిశేషు, పి.రవికుమార్, కె.విజయలక్ష్మి, ఎ.శ్యామలరాణి, సత్యనారాయణ, కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అసంపూర్తి భవనంలో తరగతులా?

ఏలూరు అర్బన్: భవన నిర్మాణం పూర్తికాకుండానే ఎల్‌కేజీ నుంచి మూడో తరగతివరకు తరగతులు నిర్వహిస్తూ యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమిస్తున్న తంగెళ్లమూడిలోని ఓ ప్రైవేటు స్కూలుపై విచారణ నిర్వహించి, విద్యాశాఖాధికారుల బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్టు పీడీఎస్‌యూ జిల్లా, నగర అధ్యక్షులు కె.నాని, వై.యశ్వంత్ తెలిపారు. నిర్మాణపనులు పూర్తికాకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని, స్కూల్లో చదిలే చిన్నారులు ప్రమాదానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారులు విచారణ నిర్వహించాలని, తరగతులకు అనుమతులిచ్చిన విద్యా శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా అక్కడికక్కడే విచారణకు ఆదేశించారని నాయకులు వివరించారు.

గ్రామసభపై గిరిజనుల ఆగ్రహం

బుట్టాయగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరంలో తహసీల్దార్ పీవీ చలపతిరావు రెవెన్యూ అధికారులు గిరిజనేతరులతో కలిసి సోమవారం గ్రామ సభ నిర్వహించడంపై స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభను అడ్డుకుని గ్రామ సచివాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ గిరిజనులకు, పిసా కమిటీ వారికి సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ సమక్షంలో రహస్యంగా గ్రామ సభను నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూసేకరణ చేపట్టేందుకు చట్ట విరుద్ధంగా గ్రామసభను నిర్వహించడంపై నిరసన తెలిపారు. గిరిజనుల సాగులో ఉన్న భూములు కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గ్రామసభను అడ్డుకుని తహసీల్దార్‌ను ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారని తెలిపారు. నాయకులు కారం భాస్కర్, పి.మంగరాజు, కోర్స జలపాలు, పూనెం దుర్గారావు, కట్టం వెంకటేశ్వరరావు, గొడ్డ పవన్ కల్యాణ్, వెట్టి వీరయ్య, ఉనుముల సూర్యచంద్రం, ఉయికె శ్రీరాములు, కోర్స సురేశ్, కాక మారయ్య, తాడి జోష్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

విద్యుత్ సరఫరాలో మార్పులు

దెందులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): దెందులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్ల పరిధిలో మంగళవారం నుంచి 18వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు.ఉదయం 8గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శ్రీరామవరం, గంగన్నగూడెం, కొత్తగూడెం, సత్యనారాయణపురం, అలుగులగూడెం, కొమిరేపల్లి గ్రామాల్లో పరిధిలోని వారికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

హ్యాండ్‌బాల్‌పై వర్క్‌షాపు

దెందులూరు జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో హ్యాండ్‌బాల్‌పై సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియాల్ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్‌లు బి.కృష్ణదీపిక, వలపుల సౌజన్యలు పాల్గొని విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు వర్క్‌షాపు డెమో నిర్వహించారు. హ్యాండ్‌బాల్ నిబంధనలు, ఆట ఆడే తీరుపై అవగాహన కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్ కుమార్, రత్నబాబు, పోలిరెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహం నిర్మించండి

బుట్టాయగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలని, మండల కేంద్రంలోని ఎస్టీ కళాశాల హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.భూషణం మాట్లాడుతూ కళాశాల భవనం నిర్మించి 50 సంవత్సరాలు దాటిందన్నారు. అయినా 170 మందికి పైగా విద్యార్థులు ఇదే భవనంలో ఉంటున్నారని, సరైన సదుపాయాలు లేవని, వెంటనే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సత్యాగ్రహ సంస్మరణ

నిడమర్రు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెదనిండ్రకొలనులోని గాంధీ భవన్‌లో ఈ నెల 16న సత్యాగ్రహ సంస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.1907లో మొదటి సత్యాగ్రహం జరిగిందని(హింస వ్యతిరేకంగా) సత్యాగ్రహ దీక్షతో పాటు ఆనాటి త్యాగాలను స్మరించుకుంటారన్నారు.

పేకాడుతున్న పదిమంది అరెస్ట్

పెదపాడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోగుంట గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ తెలిపారు. వీరి నుంచి రూ.27,630 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్.ఐ. మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

ఉంగుటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేదలకు ఆపదలో ఆదుకునేది సీఎం సహాయ నిధి పథకమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గంలోని 35 మందికి రూ.34 లక్షల 57 వేల 905 అందించామని వివరించారు.

బాధిత కుటుంబానికి సాయం

వేలేరుపాడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారం గ్రామంలో ఈ నెల 9న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధితులు, ఆశా వర్కర్‌గా పని చేస్తున్న పద్దం మేరీ కుటుంబానికి ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున రాష్ట్ర సహాయ కార్యదర్శి పూసం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంటుగా పని చేస్తున్న కూరం ప్రసాద్ వంట సామగ్రి, మంచం అందించగా మెడికల్ అసోసియేషన్ తరపున 25 కిలోల బియ్యం, 5లీటర్ల నూనె, కూరగాయలు, బట్టలు, కిరాణ సరుకులు, అందించారు. అలాగే వేలేరుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అగత ఆధ్వర్యంలో రూ.20,500 ఆర్థిక సాయం అందించారు. రుద్రంకోట గ్రామానికి చెందిన పలివెల పెద్దరాజు వెయ్యి రూపాయలు, కిరణా సరుకులు అందించారు.



జనసేన 50వ డివిజన్ కమిటీ ఎన్నిక

ఏలూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : 50వ డివిజన్‌కు నూతన కమిటీని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, రెడ్డి అప్పలనాయుడు ప్రకటించారు. ఆ డివిజన్ అధ్యక్షుడిగా ముత్యాల కొండాబును నియమించారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు తీసుకునే ప్రతి అడుగు ప్రజల విశ్వాసాన్ని చూరగునేలా ఉండాలన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడమిల్లి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

కామవరపుకోట, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని ఆడమిల్లి సచివాలయం సమీపంలోని పాత వంతెన గత వారం కుంగడంతో సోమవారం ట్రాఫిక్ మళ్లింపుకు బోర్డును ఏర్పాటు చేశారు. ఆడమిల్లి వంతెన నుంచి బస్సులు, లారీలు, వ్యానులు ద్వారకాతిరుమల, వెంకట కృష్ణాపురం మీదుగా రాకపోకలు సాగించాలని తెలిపారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి : జయమంగళ

కలిదిండి, జూలై14(ఆంధ్రజ్యోతి):జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. సోమవారం మూల్లంకలో పార్టీ సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. జనసేనలో చేరిన యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. జనసేన మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్నబాబు, గ్రామ జనసేన అధ్యక్షుడు యడ్ల కృష్ణారావు, నాయకులు వి.శ్రీనివాసరావు, తాడి ఇంద్ర, అందె నెహ్రూ, ఎల్.నాగేంద్ర, జి.రాంబాబు, వి.బాబూరావు పాల్గొన్నారు.

ఈదర ప్లస్ పాఠశాలకు శానిటరీ వస్తువుల అందజేత

ఆగిరిపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈదర గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ్ వారోత్సవాల సందర్భంగా ఆడపిల్లలకు శానిటరీ వస్తువులు అందజేశారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ కొండపల్లి వారి సంస్థ తరఫున కృపా శంకర్ తివారి డీజీఎం, తిపర్తి రాంబాబు, సీనియర్ ఫోర్‌మెన్‌లు పాఠశాలలో శానిటరీ, నాప్కిన్స్, క్లీనింగ్ వస్తువులను అందజేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం శారద, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి మరమ్మతులు చేపట్టిన రైతులు

స్వచ్ఛందంగా రహదారికి మరమ్మతులు

కలిదిండి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉన్న మూల్లంక-పెదలంక ప్రధాన రహదారికి రైతులు సోమవారం స్వచ్ఛందంగా మరమ్మతులు ప్రారంభించారు. రహదారిపై పడిన గోతులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. బస్సులు, ఇతర వాహనాలు రాక పోకలకు అంతరాయం కలగకుండా మూల్లంక నుంచి పెదలంక వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని రైతులు తెలిపారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, డీసీ మాజీ చైర్మన్ సారిక వెంకటేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.



వడాలిలో ప్రమాణస్వీకారం చేసిన పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు

సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

ముదినేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి రైతులకు మరిన్ని రుణ సదుపాయాలను కల్పించేందుకు త్రిసభ్య కమిటీలు కృషి చేయాలని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. సోమవారం మండలంలోని వడాలి పీఏసీఎస్‌కు నియమితులైన త్రిసభ్య కమిటీ చైర్మన్ అనగాని గంగాధరరావు, సభ్యులు మరడాని సత్యనారాయణ, మందపాటి గంగరాజు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కలిగించేందుకు తమవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పెదగొన్నూరు డీసీ వైస్ చైర్మన్ కట్టా కోటేశ్వరరావు, వడాలి పాలకేంద్రం అధ్యక్షుడు ఈడే బాబూజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

13 మందికి కృత్రిమ కాళ్లు అందజేత

ఆగిరిపల్లి, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): హిల్ కృత్రిమ అవయవ కేంద్రంలో 13 మందికి కృత్రిమ కాళ్లు అందజేశారు. చుండూరు కోటయ్య, రామశేషమ్మ చారిటబుల్ ట్రస్టు వారి ఆర్థిక సహకారంతో మండలంలోని తోటపల్లి హిల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 13 మందికి గాను 15 కృత్రిమ కాళ్లను అమర్చినట్లు హిల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు. ట్రస్ట్ అధినేత చుండూరి మధుసూదనరావు మాట్లాడుతూ కృత్రిమ కాళ్లు పొందిన దివ్యాంగ బాలబాలికలు విద్యను కొనసాగించడం అభినందనీయమన్నారు. హిల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్, ప్రముఖ సంఘ సేవకులు చుండూరు బుజ్జమ్మ, గవిర్నేని పద్మ, వీరపనేని రామారావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'భూముల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచండి'

నూజివీడు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేద దళిత భూములను తిరిగి ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ నూజివీడు మండలం పాతరావిచర్ల గ్రామస్థులు నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌కు విజ్ఞప్తి చేశారు. గత 30, 40 ఏళ్ల నుంచి రావిచర్లలో ఉన్న నల్లగట్టు, భోగం గట్టు ప్రాంతాలలో అనేక దళిత భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వాటికి బీ-ఫామ్ పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసి ఉందని తద్వారా బ్యాంకుల్లో రుణాలు పొందారని, అయితే ఇటీవల భూముల వివరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో దళిత రైతులు అనేక మంది అన్నదాత సుఖీభవకు అర్హత సాధించలేకపోతున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బి.నగేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇస్తామని దోపిడీ..

ఏలూరుక్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామున లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని మార్గమధ్యలో దాడిచేసి గాయపర్చి నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్ అపహరించుకుపోయాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కైకలూరుకు చెందిన సాదర్ల బ్రహ్మం(39) హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. తన ఇంటికి వెళ్లే నిమిత్తం హైదరాబాద్ నుంచి రైల్లో ఈనెల 13వ తేదీ తెల్లవారు జామున 3.30 గంటలకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడ నుంచి కైకలూరు వెళ్లే నిమిత్తం మార్కెట్ రోడ్డులోని అజంతా సెంటర్‌లో నిలబడి ఉండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగారు. తాము కూడా అటే వెళ్తున్నామని నమ్మబలికి లిఫ్టు ఇస్తామని నమ్మబలికి ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో వైఎస్ఆర్ కాలనీ వద్ద తమ్మిలేరు రోడ్డునకు తీసుకుపోయి అతనిపై దాడి చేసి గాయపరిచారు. అతని వద్ద ఉన్న 5,500 నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌ను అపహరించుకుపోయాడు. బాధితుడు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దోపిడీకి పాల్పడింది ఇద్దరే అయినా ఈ గ్యాంగ్ ఐదుగురు ఉన్నట్టు పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

కమిటీలేవి సామీ!

(5వ పేజీ తరువాయి)

ఖాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. కొల్లేరు పెద్దింటమ్మ ఆలయ చైర్మన్ ఎవరు అని టెన్షన్‌గా ఎదురుచూస్తున్నారు. కానీ కొల్లేటి కోటకు చెందిన జల్లూరి వెంకన్న ఈ పదవికి నామినేట్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎందుకీ జాప్యం?

జిల్లావ్యాప్తంగా 89 పైగా ఆలయాలుండగా 73 దేవాలయాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో కేవలం 43 ఆలయ కమిటీలకు మాత్రమే ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారు. మిగతా 30పైగా ఆలయ కమిటీలకు సిఫార్సులు లేదా ప్రతిపాదన దేవదాయ శాఖకు అందనేలేదు. వాస్తవానికి ఆది నుంచి పార్టీ కోసం నిత్యం పరిశ్రమించిన వారు లేకపోలేదు. పార్టీపై అభిమానంతో సొంత ఖర్చులను భరించి, అసలు పనులను వదిలేసి ఫుల్‌టైమర్లగా వ్యవహరిస్తున్న వారు లెక్కకు మిక్కిలి ఉన్నారు. ఎమ్మెల్యేలు మాత్రం నామినేటెడ్ పదవుల భర్తీలో ముందడుగు వేయలేకపోతున్నారు. కేవలం క్యాడర్‌లో సీనియర్లు, జూనియర్లుగా విభజన, సామాజిక వర్గాల వారీగా పోటీ తీవ్రంగా ఉండడంతో ఏడాది నుంచి ఎటూ తేల్చలేకపోయారు. ఆలయ కమిటీల్లో చైర్మన్, సభ్యులుగా నియమితులైతే కేవలం గౌరవ ప్రతిష్ఠలతోనే ఒక సేవగా భావించి ఆలయాల అభివృద్ధికి కష్టపడతారు. సాధ్యమైనంత వరకు సీనియర్లే ఈ పదవులను ఆశిస్తారు. సామాజికపరంగా ఈసారి తమ వారికే అవకాశం ఇవ్వాలని చాలా ఆలయాల పరిధిలో నేతలు పట్టుబడుతున్నారు. కనీసం వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం మధ్యే సయోధ్య సాధించి ఆ మేరకే ఆలయ కమిటీలను సిఫార్సు చేసి ఉండాల్సింది. స్థానిక ఎమ్మెల్యేకు కొంత మేర సిఫార్సుల ఒత్తిడి ఉండేది. ఇప్పుడు కనీసం సిఫార్సు చేయడంలో జాప్యంతో క్యాడర్‌లో అసంతృప్తి, ఆగ్రహం కనిపిస్తోంది. ఆలయ కమిటీలను ఆగస్టులో భర్తీ చేస్తారని, ఆలోపు జాబితాలను మరోసారి పరిశీలించడం, రాని వాటిని రప్పించుకోవడం జరుగుతుందని ఇంకొందరు భావిస్తున్నారు. ఆలయ కమిటీలపై ఎమ్మెల్యేలు దృష్టిపెడితే కొందరికైనా నామినేటెడ్ పదవులు దక్కుతాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అందని వైద్యసేవలు

- ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిన నాడు-నేడు పనులు
- అత్యవసర విభాగంలోనూ శస్త్రచికిత్సలు నిల్.. రోగుల గగ్గోలు

ముసునూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముసునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న సందంగా ఉన్నాయి. నాలుగున్నరేళ్ల క్రితం చేపట్టిన పనులు నేటికి 20శాతం కూడా పూర్తికాకపోవడంతో పాటు చేసిన పనులు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. అభివృద్ధి పనులు చేపట్టకముందు ఈ పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, రోగులకు అత్యవసర వైద్యసేవలను అందించేవారు. అభివృద్ధి పేరుతో వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో పరికాలన్నీ చెల్లాచెదురు చేయడంతో ఈ పీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు, రోగులకు అత్యవసర సేవలు నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.42 లక్షల నిధులు విడుదల

నాడు-నేడు పథకం కింద ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు నాలుగున్నరేళ్ల క్రితం రూ.42లక్షలను నిధులను విడుదల చేశారు. ఈ పీహెచ్‌సీలో నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు 20శాతం కూడా పూర్తికాలేదు. బిగించిన తలుపులు, దర్వాజాలు, ఎలక్ట్రికల్ సామగ్రి సైతం నాసిరకంగా ఉన్నాయనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. నాడు-నేడు పనులపై వైద్యాధికారులు నాలుగేళ్లుగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నా స్పందన లేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టెండర్ వేసేందుకు రావడం లేదు

పీహెచ్‌సీలో నిలిచిన నాడు-నేడు పనులు చేసేందుకు నూతన టెండర్లు పిలిచినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించాం కాంట్రాక్టర్ పనులు చేయనని చెప్పడంతో మళ్లీ టెండర్లు పిలిచాం. టెండర్ పడగానే పనులు ప్రారంభిస్తాం.

- సీహెచ్.బాబూరావు
ఆర్‌అండ్‌బీ డీఈ, నూజివీడు.



ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



చిగురుకోటలో కరపత్రాలు అందిస్తున్న కొడాలి వినోద్, టీడీపీ నాయకులు



కైకలూరులో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న వీరమల్లు నరసింహారావు



నరసింహారావుపాలెంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తున్న కొలుసు నితిన్‌కృష్ణ

చంద్రబాబుతోనే సుస్థిర పాలన

- ఏపీ టీడీసీ డైరెక్టర్ వినోద్
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు

ముదినేపల్లి/కైకలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడుతోనే సుస్థిర పాలన సాధ్యమని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. సోమవారం ముదినేపల్లి మండలం చిగురుకోటలో పార్టీ నాయకులతో కలసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై ప్రచారాన్ని నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి కందేపి పద్మ, పార్టీ నాయకులు ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కైకలూరు పట్టణంలోని 112, 113, 119వ బూత్‌లలో నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, సదర్ల నూరి, బూత్ ఇన్‌చార్జి బి.రామస్వామి పాల్గొన్నారు.

● ముసునూరు/ఆగిరిపల్లి/చాట్రాయి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర అన్నారు. సోమవారం ముసునూరు మండలం వలసపల్లిలో జరిగిన 'సుపరి టపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు చలసాని దామోదరరావు, సుధగాని తులసీరామ్, నెరుసు సత్యనారాయణ, అలూరి సీతారామ రాజు, కొలుసు సత్యనారయణ, పామర్తి ప్రసాద్, సుధగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం విన్నమరెడ్డి పల్లి గ్రామంలో కూటమి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు జన్ని రాంబాబు, గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి గోళ్ల చిన్న బాలయ్య, గోళ్ళ చంటి, రొంపిచర్ల గిరిధర్, యలమర్తి భవానిశంకర్, యలమర్తి సువర్ణబాబు, కొవ్వలి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈదర గ్రామంలో మాజీ సర్పంచ్ బెక్కం వెంకట నరసింహరావు, పామర్తి రామకృష్ణ, నీలం కుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. చాట్రాయి మండలం నరసింహారావుపాలెంలో సోమవారం సాయంత్రం మంత్రి కొలుసు పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం' టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి 2025-26లో రూ 47,456 కోట్లు కేటాయించటమే కాకుండా నామినేటెడ్ పోస్టులలో 34 శాతం, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, కట్టా నాగ దుర్గారావు, గార్లపాటి మారేష్, కటారి సీమోను, కోట వెంకటేష్, ఉయ్యాల దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



ఎంపీ మహేశ్‌కుమార్‌తో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

ఎంపీని కలిసిన నాయీ బ్రాహ్మణ నాయకులు

చాట్రాయి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్‌ను నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం కలిసి విన్నవించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 50 ఏళ్లకు పెన్షన్, బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. వీటిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని నూజివీడు నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు రాయవరపు సీతారాములు తెలిపారు.

పద్మారావును కలిసిన మాలమహానాడు నేత బాబూరావు



ముదినేపల్లి, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి పద్మారావును సోమవారం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ముదినేపల్లికి చెందిన సేవా నాగజగన్ బాబూరావు మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా లుంబిని వనం గ్రామంలో కలిశారు. పద్మారావు రచించిన 195 రకాల పుస్తకాలను సంపుటిగా రూపొందించి దళిత వర్గాల్లో ఐక్యతను సాధించేందుకు ప్రయత్నించాలని కోరారు.

కడుపునొప్పి తాళలేక రైతు ఆత్మహత్య



రామకృష్ణ మృతదేహం

నూజివీడు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవరకొండ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పల్నాటి రామకృష్ణ (32) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడు కలుపు ముందును సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు నూజివీడు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నూజివీడు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరంలో 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి, జూలై 14(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలవరంలో సోమవారం జరిపిన దాడిలో 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి, నేరస్థలం నుంచి పరారైన కలవకొల్లు రెడ్డియ్యపై కేసు నమోదు చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. అదే గ్రామానికి చెందిన గాదె మల్లేసును అదుపులోకి తీసుకుని అతడి వద్ద వున్న 5 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామని, సారా సరఫరా చేసిన పోతనపల్లి గ్రామానికి చెందిన దరావత్తు నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు. గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడి పరారైన పోతనపల్లి పెద్ద తండాకు చెందిన బాణావత్తు శివాజీని అదుపులోకి తీసుకున్నామని, నిందితులు బాణావత్తు శివాజీ, గాదె మల్లేసులను తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీఐ వెల్లడించారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

నూజివీడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ ఎంఎల్, అఖిల భారత కిసాన్ మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో పేదల సాగు చేస్తున్న ఫారెస్ట్ ఫోర్ నోటిఫికేషన్‌లో లేనందున రెవెన్యూ ఫారెస్ట్ జాయింట్ సర్వే చేసి పేదలకు 125 ఎకరాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం, శ్మశాన స్థలం మంజూరు చేయాలని తదితర వాటిపై డిమాండ్ చేశారు. ఈమేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్, ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, చాట్ల బాబూరావు, కలపాల వెంకటేశ్వరరావు, వేముల బక్కయ్య, భవాని, శ్రీలక్ష్మి, కళావతి, మారేసు సుందరం పాల్గొన్నారు.

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలి : సీఐటీయూ

నూజివీడు టౌన్, : జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన తెలిపారు. సోమారం నూజివీడు మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మునిసిపల్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం చాలా దారుణమన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్, మునిసిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ ఇన్‌చార్జి గుండెపోటుతో మృతి



రెడ్డియ్య (ఫైల్)

ముసునూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రామ ఎస్సీకాలనీ 98వ బూత్ ఇన్‌చార్జి, టీడీపీ యువ నాయకుడు బల్లవరపు రెడ్డియ్య(34) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్, స్థానిక నాయకులు రెడ్డియ్య పార్థివదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత తొమ్మిదేళ్లుగా బూత్ ఇన్‌చార్జిగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. అతడి కుటుంబానికి పార్టీ అన్నివిధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రెడ్డియ్య అత్యక్రియలు, ఇతర కార్యాకలాపాలను గణేష్ దగ్గర ఉండి చూశారు.

'108' టెక్నీషియన్‌పై దాడి.. కేసు నమోదు

కైకలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న '108' టెక్నీషియన్‌పై కొంతమంది యువకులు దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేశామని కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్‌శ్రీను తెలిపారు. వరహాపట్నంకు చెందిన కోనాల లక్ష్మణరావు 108 వాహనంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి వరహాపట్నం నుంచి కైకలూరు వస్తుండగా మార్గమధ్యలో గోపవరం రైల్వేగేటు మూసి ఉంది. రైలు వెళ్లిన తరువాత అతడి బైక్ వెనుక మరో బైక్‌పై మండలంలోని ఆటపాక శివారు జాన్‌పేటకు చెందిన కొదమల హేమంత్ పలుమార్లు హారన్ కొడుతూ పక్కకు తీయమన్నాడు. ముందు వాహనాలు వెళ్లకుండా ఎలా వెళ్లానంటూ ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. హేమంత్ జాన్‌పేట గ్రామానికి చెందిన తన స్నేహితులకు ఫోన్ చేసి ఘటనా స్థలానికి రప్పించి దాడి చేశారు. గాయాలైన లక్ష్మణరావును కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హేమంత్‌తో పాటు ఏడుగురు, మరికొంతమందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

కఠిన చర్యలు తీసుకోవాలంటూ బంధువుల ఆందోళన

ఏలూరు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : పద్నాలుగేళ్ల బాలికపై 75 ఏళ్ళ వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడటంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక 7వ తరగతి చదువుతోంది. ఆమె తల్లి దండ్రులు వేరే పనులకు వెళ్లడం వల్ల బాలిక ఉదయం 9 గంటలకు స్కూలుకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు వస్తోంది. ఆ తరువాత అమ్మమ్మ ఇంటికి వెళ్తోంది. తల్లిదండ్రులు వచ్చిన తరువాత ఆ బాలికను ఇంటికి తీసుకొస్తారు. ఆ బాలిక అమ్మమ్మ ఇంటికి రోజూ వెళ్తున్న సమయంలో ఏలూరు కొత్తపేట నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన తిర్రి సూర్యనారాయణమూర్తి(75) అనే వృద్ధుడు మాయ మాటలు చెప్పి వారం నుంచి తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక వేధిపులకు పాల్పడుతున్నాడు. జరిగిన ఘటనను కుటుంబ సభ్యులకు బాలిక చెప్పడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే వృద్ధుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వదిలివేశారంటూ బాధితులు ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. వృద్ధుడు తమ అదుపులోనే ఉన్నాడని ఒక మహిళను తీసుకెళ్లి చూపించడంతో వారు శాంతించారు. టూటౌన్ సీఐ ఎస్.అశోక్ కుమార్, ఎస్ఐ మధు వెంకటరాజా బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరాకు చర్యలు

- మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి



నూజివీడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా నూజివీడు పట్టణ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని నూజివీడు మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో సాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నీటి సరఫరా అవసరమైనవారు 98499 06574, లేదా 91009 52627 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.




ముదినేపల్లి ఎరువులషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ముదినేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ శాఖ రాజమండ్రి డీఎస్పీ ఎస్.తాతారావు హెచ్చరించారు. సోమవారం ముదినేపల్లి మండలంలోని పలుఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. కొన్ని షాపుల్లో రికార్డులు లేకుండా రూ. 1.90 లక్షల విలువైన 25 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించి వాటి అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువుల అమ్మకాలకు సంబంధించిన రసీదులు ఇవ్వాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఏడీఏ డి.కృష్ణ, ఏడీఏలు జి.వెంకటమణి, టి. అనిల్‌కుమారి, ముదినేపల్లి మండలం ఏవో వేణుమాధవ్ పాల్గొన్నారు.

మండవల్లి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా శ్యామ్‌గణేశ్



శ్యామ్‌గణేశ్

మండవల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా వరదా శ్యామ్‌గణేష్‌ను ఎన్నుకున్నారు. తుంపూడి గణేష్‌ను ప్రాంతీయ కార్యదర్శిగా నియమించారు. సమావేశంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయిశ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య పెద్దలు ఘంటసాల రాజమోహన్, కన్నయ్య కొత్త లక్ష్మీనారాయణ, తిరువీధి సుబ్బారావు, మాడిశెట్టి శివప్రసాద్, పులవర్తి నటరాజ్ శేఖర్ నంబూరి వెంకటేశ్వరరావు, కొత్త కిరణ్, మండల పెద్దలు చలంచర్ల కాశీ విశ్వేశ్వర సుబ్రహ్మణ్యం దాసరి కృష్ణకిషోర్, అద్దేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కైకలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా కైకలూరు పట్టణంలో మంగళవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కోరుకొల్లు రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ, రైల్వేస్టేషన్ ఏరియా, చిన్నమసీదు, ఆటపాక షాదీఖానా ప్రాంతం, అగ్రహారం రోడ్డు ప్రాంతంలో కరెంట్ సరఫరా ఉండదని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.